teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్


నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 127 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 28 అక్టోబర్ 2025 | పేజీలు : 08 | వెల ‘5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై సీఈసీ కీలక ప్రకటన
బిహార్‌లో విజయవంతంగా పూర్తయిందని స్పష్టం
మరో 12 రాష్ట్రాల్లో నిర్వహించబోతున్నట్లు వెల్లడి




## రేవంత్ రెడ్డితో సమావేశంలో టాలీవుడ్ కీలక నిర్ణయం

- నేడు సినిమాల షూటింగ్స్, పోస్ట్ ప్రొడక్షన్ పనులకు విరామం
- యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో సన్మాన కార్యక్రమం
- సినీ పరిశ్రమకు పూర్తి సహకారంపై సీఎం హామీ
- పరిశ్రమను నియంత్రించే పనులు సహించబోమని స్పష్టీకరణ
- చట్ట పరిధిలోనే పని చేయాలని సీఎం సూచన


.. వివరాలు 2లో



## మొంథా తుఫాను బీభత్సం.. ఏపీలో 54 రైళ్లు రద్దు

- మచిలీపట్నం - కళింగపట్నం మధ్య తీరం దాటనున్న తుఫాను
- ఉత్తరాంధ్రతోపాటు పలు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు
- ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా రైళ్లను రద్దు చేసిన దక్షిణ మధ్య రైల్వే

.. వివరాలు 2లో






# చర్యలేవి

### రాష్ట్రాల తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం
### ఉత్తర్వులను అమలు చేయడంలో ఘోరంగా విఫలం
### అంతర్జాతీయ స్థాయిలో పరువు తీశారంటూ మండిపడ్డ సుప్రీంకోర్ట్

**వీధి కుక్కల నియంత్రణకు తాము ఆదేశాలు ఇచ్చి రెండు నెలలు గడిచినా ఇప్పటి వరకు స్పందించలేదంటూ ఆయా రాష్ట్రాల తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ ఉత్తర్వులను అమలు చేయడంలో ఘోరంగా విఫలం అయ్యారని, తద్వారా అంతర్జాతీయ స్థాయిలో దేశం పరువు తీశారంటూ సర్వోన్నత న్యాయస్థాన మండిపడింది.**

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 27 (తీన్మార్ న్యూస్): తమ ఆదేశాల తర్వాత కూడా దేశవ్యాప్తంగా వీధి కుక్కల దాడుల ఘటనలు నమోదు అవుతూనే ఉన్నాయని, వీధి కుక్కల దాడులపై రోజూ మీడియాలో వార్తలు వస్తున్నా చలనం లేదా అని ప్రశ్నించింది. తమ ఆదేశాల మేరకు అఫిడవిట్లు దాఖలు చేయడంలో విఫలం అయినందుకు పశ్చిమబెంగాల్, తెలంగాణ, ఢిల్లీ మినహా మిగతా అన్ని రాష్ట్రాల సీఎస్‌లంతా నవంబర్ 3న జరగబోయే తదుపరి విచారణలో స్వయంగా హాజరై ఇన్ని రోజులు కౌంటర్

మిగతా 2 లో

## తేమ శాతం తనిఖీ చేసుకోండి

- పత్తి కొనుగోళ్లపై మంత్రి తుమ్మల కీలక సూచన
- మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు
- కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు లేఖ రాసినట్లు వెల్లడి
- సందేహాలు, ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు




## తెలంగాణకు “మొంథా” తుఫాను ఎఫెక్ట్

- 4 జిల్లాలకు ‘రెడ్ అలర్ట్’ జారీ చేసిన వాతావరణ కేంద్రం
- మిగిలిన జిల్లాలకు ‘ఎల్లో అలర్ట్’ జారీ
- తెలంగాణ అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- ధాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలి
- రైతులకు నష్టం లేకుండా చర్యలు చేపట్టాలని సూచన
- మంత్రులు ఉత్తమ్, తుమ్మల వీసీ ద్వారా అధికారులతో సమీక్ష



హైదరాబాద్, అక్టోబర్ 27 (తీన్మార్ న్యూస్): మొంథా తుఫానుతో తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో రాష్ట్ర

మిగతా 2 లో



## ఆటోలో కేటీఆర్ ప్రయాణం

6 లక్షల ఆటో డ్రైవర్ల పరిస్థితి ఇబ్బందికరమని వ్యాఖ్య

- హామీ ఇచ్చినా డ్రైవర్లకు న్యాయం జరగలేదని విమర్శ
- ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీత
- 161 మంది ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ. 10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్

02



04

## మంత్రులు మహిళా అధికారులను వేధిస్తున్నారు

తెలంగాణ కేబినెట్‌లోని కొందరు మంత్రులపై ఆరోపణలు
కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

## జూబ్లీహిల్స్‌లో ఎన్నిక నేపథ్యంలో ప్రధాన పార్టీల దూకుడు

### ఎన్నికల బరిలో 58 మంది అభ్యర్థులు

- ప్రచారంలో వేగం పెంచిన ప్రధాన పార్టీలు
- సిట్టింగ్ స్థానం కోసం బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల ఫుల్ ఫోకస్
- ఎన్నికల గుర్తుల కేటాయింపుతో ఊపందుకున్న ప్రచారం



హైదరాబాద్, అక్టోబర్ 27 (తీన్మార్ న్యూస్): జూబ్లీహిల్స్‌లో మూడు ప్రధాన పార్టీలు దూకుడు పెంచాయి. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రచారంలో వేగం పెంచాయి. నామినేషన్ల విత్ డ్రా ప్రక్రియ ముగియడంతో 58 మంది అభ్యర్థులు

మిగతా 2 లో






## ముగిసిన మద్యం షాపుల డ్రా ప్రక్రియ

### రాష్ట్రవ్యాప్తంగా 2620 మద్యం షాపులకు డ్రా పూర్తి

- హైదరాబాద్, సికింద్రాబాద్‌లో 179 షాపులకు కేటాయింపు
- డిసెంబర్ 1 నుంచి కొత్త వైన్స్ షాపుల నిర్వహణ
- అధిక ఫీజు నేపథ్యంలో సిండికేట్‌గా టెండర్లు

02

## బీఆర్ఎస్‌కు భారీ షాక్


విరాళాలు 97.4% తగ్గుదల




04

- అధికారం కోల్పోగానే గులాబీ పార్టీ ఫండ్స్ పతనం
- 2024-25లో కేవలం రూ. 15.09 కోట్లు మాత్రమే ఫండ్స్
- ఈసీకి సమర్పించిన వెల్లడి
- ట్రస్టుల నుంచి అందిన రూ.15 కోట్ల విరాళాలు
- గత ఏడాదితో పోలిస్తే రూ.580.52 కోట్ల నుంచి భారీగా క్షీణత

## డీప్‌ఫేక్ బారిన మెగాస్టార్ చిరంజీవి



- ఫోటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్
- సీపీ సజ్జనార్‌ను ఆశ్రయించిన చిరంజీవి
- కేసు విచారణపై స్పందించిన సిటీ పోలీస్ కమిషనర్
- కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక
- ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో దర్యాప్తు తప్పించుకోలేరని వార్నింగ్ ఇచ్చిన సీపీ సజ్జనార్

02

# ఎంపీడీఓపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

## చట్టపరమైన చర్యలకు “ఇందిరమ్మ ఇల్లు” బాధితురాలు డిమాండ్

## స్టేషన్‌లో ఎఫ్ఐఆర్, పరిపాలనా స్థాయిలో కఠిన చర్యలపై సర్వత్రా ఉత్కంఠ



ఇందిరమ్మ ఇళ్లు..

రాజకీయ రంగు

కాంగ్రెస్ పార్టీ పంపిణీ కార్యక్రమంగా “ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ”

- రాజకీయ సుడిగుండంలో జిల్లా ప్రజలు
- బీఆర్ఎస్‌లో ఉన్నారని ఆపిన ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత
- ఎమ్మెల్యే, మంత్రి ఆదేశాలతోనే పత్రాల నిలుపుదల
- ఆర్టీఐ దరఖాస్తుకు ఎంపీడీఓ కార్యాలయ సమాధానం
- సమాచార హక్కు చట్టంతో బయటపడిన షాకింగ్ నిజం
- ఇల్లు మంజూరైనా ఇదేం గోస : సుమలత
- ప్రశ్నిస్తే.. ఎమ్మెల్యే అహంకార ధోరణి
- ముఖ్యమంత్రికి చెప్పుకొన్నా.. ఇల్లు ఇవ్వము
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుపై సుమలత ఆరోపణ
- సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని న్యాయం చేయాలి
- బాధితురాలు సహా గ్రామస్థుల విన్నపం


“మీరు ముఖ్యమంత్రికి చెప్పుకొన్నా మీకు ఇల్లు ఇవ్వము” ఎమ్మెల్యే అహంకార ధోరణి

తెలంగాణలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇండ్ల పథకం రాష్ట్రంలో తీవ్ర విమర్శలపాలవుతోంది. ... తాజాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి మండలం, కొత్తపల్లి (బి) లో జరిగిన సంఘటన అద్దం పట్టినట్లు చెప్పవచ్చు.

తీన్మార్ www.teenmaarepaper.com 27 Oct 2025 - Page 1







ఫిర్యాదుకు జత చేసినట్లు బాధితురాలు వెల్లడించారు.

కొత్తపల్లి గోరి, అక్టోబర్ 27 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ సామాజిక అభివృద్ధి పథకాల అమలులో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కొత్తపల్లి గోరి మండల అధికారి రాజకీయాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలతో భూపాలపల్లి జిల్లాకు చెందిన ఓ బాధితురాలు సంచలనానికి తెరలేపింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి (%వీూణూ%)పై నేరుగా కొత్తపల్లి గోరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

### ఫిర్యాదులో ప్రధాన అంశాలు:

బాధితురాలు జవ్వాజి సుమలత భర్త రమేష్ చేసిన ఫిర్యాదు ప్రకారం... కొత్తపల్లి గోరి మండల ఎంపీడీఓ.. ప్రభుత్వ అధికారిగా తన బాధ్యతలను పూర్తిగా విస్మరించారు. ఆయన అధికార పార్టీ రాజకీయాలకు వత్తాసు పలకడం వల్ల తన కుటుంబం తీవ్రంగా సామాజిక అభివృద్ధిలో.. ప్రభుత్వ ఫలాలు పొందడంలో నష్టపోతునట్లు వెల్లడించారు. ముఖ్యంగా గ్రామంలో తమ ఒక్కరికే సామాజిక అభివృద్ధి పథకానికి సంబంధించిన (ఇందిరమ్మ ఇల్లు) ప్రొసీడింగ్ ఇవ్వకుండా ఎంపీడీఓ అడ్డుకున్నారని, దీని కారణంగా తమకు అన్యాయం జరిగిందని ఫిర్యాదులో స్పష్టం చేశారు జవ్వాజి సుమలత.

### చట్టపరమైన డిమాండ్:

బాధితురాలు జవ్వాజి సుమలత చట్టపరమైన అంశాలను కూడా పిర్యాదులో ప్రస్తావించడం గమనార్హం. భారతీయ న్యాయ సంహిత (%దీచీూ%), ప్రభుత్వ ఉద్యోగుల నియామవళి, భారత రాజ్యాంగంలోని పౌర హక్కులు మరియు జీవన స్వేచ్ఛ వంటి కీలక అంశాల ఆధారంగా ఎంపీడీఓపై తగిన కేసు నమోదు చేయాలని కోరుతూ పిర్యాదు చేసినట్లు జవ్వాజి సుమలత తెలిపారు. తన జరిగిన అన్యాయానికి రుజువుగా ఉన్న పత్రాలను కూడా

### అధికారుల స్పందనపై ఉత్కంఠ:

ప్రభుత్వ అధికారిపై ఫిర్యాదు రావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ ఫిర్యాదుపై పోలీసులు, జిల్లా ఉన్నత స్థాయి అధికారులు (కలెక్టర్ వంటివారు), జిల్లా స్థాయి రాజకీయ నాయకులు ఏ విధంగా స్పందిస్తారు అనేది ఇప్పుడు ప్రధాన ప్రశ్న. సాధారణంగా, ప్రభుత్వ అధికారులపై వచ్చే ఫిర్యాదులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన తర్వాతే పోలీసులు కేసు నమోదు చేస్తారు. ఈ నేపథ్యంలో.. పోలీసులు.. ఫిర్యాదులోని అంశాల తీవ్రత, జతచేసిన ఆధారాలను బట్టి కేసు నమోదు చేస్తారా? లేదా ప్రాథమిక విచారణకు పరిమితం చేస్తారా? అలాగే జిల్లా ఉన్నతాధికారులు ఎంపీడీఓ పనితీరుపై అంతర్గత విచారణకు ఆదేశిస్తారా? లేదా బాధితురాలికి న్యాయం చేసేందుకు ప్రొసీడింగ్ జారీ చేయిస్తారా?, ఈ వివాదంలో రాజకీయ జోక్యం స్పష్టంగా కనిపిస్తున్నందున, రాజకీయ నాయకులు బాధితురాలికి అండగా నిలబడతారా? అనేది వేచి చూడాలి. బాధితురాలికి న్యాయం జరుగుతుందా లేదా అన్నది, ఈ ఫిర్యాదుపై అధికార వర్గాలు తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉండనుంది.

# ఆటోలో కేటీఆర్ ప్రయాణం


హైదరాబాద్, అక్టోబర్ 27 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కారు దిగారు. సోమవారం కేటీఆర్ తెలంగాణ భవన్‌కు వెళ్తున్నపుడు ఆయన ప్రయాణిస్తున్న కారు దిగి ఆటో ఎక్కారు. ఆటోలోనే తెలంగాణ భవన్‌క చేరుకున్నాడు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణలోని ఆరు లక్షలకుపైగా ఆటో డ్రైవర్ల పరిస్థితి చాలా ఇబ్బందికరంగా మారిందని అన్నారు. తాను వచ్చిన మస్రత్ అలీ అనే వ్యక్తి ఆటోలోనే అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ ప్రయాణించినట్లు కేటీఆర్ చెప్పారు. ఆటో డ్రైవర్లకు అన్నీ చేస్తామని రాహుల్ గాంధీ నాడు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మస్రత్ అలీ తనకున్న రెండు ఆటోలు అమ్మి ఆయన ప్రస్తుతం కిరాయి ఆటో నడుపుతున్నట్లు చెప్పారని వివరించారు. ఆత్మహత్య చేసుకున్న 161మంది ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# జూబ్లీహిల్స్‌లో ఎన్నిక నేపథ్యంలో “ప్రధాన పార్టీల దూకుడు”

మొదటి పేజీ తరువాయి

బరిలో ఉన్నట్లు ఈసీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇటీవల ఎన్నికల గుర్తులను కూడా కేటాయించింది. దీంతో అభ్యర్థులంతా ప్రచారపర్వాన్ని పరుగులు పెట్టించే యత్నాల్లో మునిగిపోయారు. అయితే సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్, అధికార కాంగ్రెస్, బీజేపీ

ఇలా మూడు పార్టీలు ఫుల్ ఫోకస్ పెట్టాయి. అయితే అధికార కాంగ్రెస్‌కు ఇది ప్రతిష్టాత్మకమైన ఎన్నిక కావడంతో స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి బరిలోకి దిగబోతున్నారు. ఈరోజు సాయంత్రం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం చేయబోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. నగరంలోని యూసుఫ్ గూడా పోలీస్ గ్రౌండ్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తారని తెలిపారు.



# ముగిసిన “మద్యం షాపుల” డ్రా ప్రక్రియ



హైదరాబాద్, అక్టోబర్ 27 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో మద్యం షాపుల డ్రా ప్రక్రియ ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 2620 షాపులకు సోమవారం అధికారులు, కలెక్టర్ల సమక్షంలో ఎక్సైజ్ శాఖ అధికారులు డ్రా తీశారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌లో 179 మద్యం షాపులకు డ్రా ముగిసింది. డిసెంబర్ 1వ తేదీ నుంచి తెలంగాణ వ్యాప్తంగా కొత్త వైన్స్ షాపుల నిర్వహణ కొనసాగనుంది. కాగా, స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉండటంతో మద్యం షాపులు దక్కించుకునేందుకు కొందరు సిండికేటై టెండర్లు వేశారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారంపై విపక్షాలు నెగిటివ్ ప్రచారం చేస్తుండటంతో యువకులు, వ్యాపారులు మద్యం వ్యాపారంపై పలువురు కన్నేశారు. పలుచోట్ల గ్రూపుగా ఏర్పడి ఎక్కవగా దరఖాస్తులు వేశారు. గ్రూపుగా కావడంతో పాటు ఫీజు పెంపు కారణంగా దరఖాస్తులు తగ్గినట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఒక్కో దరఖాస్తుకు ప్రభుత్వం రూ.3లక్షలు ఫీజు పెట్టిన విషయం తెలిసిందే. ఎంపికైన దరఖాస్తు దారులు అదే రోజు గానీ, మరుసటి రోజు గానీ షాప్ ఎక్సైజ్ పన్ను మొదటి వాయిదాను చెల్లించి షాపు కేటాయింపు నిర్ధారణ లేఖ తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

# డీప్‌ఫేక్ బారిన మెగాస్టార్ చిరంజీవి

హైదరాబాద్, అక్టోబర్ 27 (తీన్మార్ న్యూస్): టాలివుడ్ నటుడు, మెగాస్టార్ చిరంజీవి డీప్‌ఫేక్ కేసు విచారణపై హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పందించారు. టెక్నాలజీ పెరుగుతున్న క్రమంలో ఇటీవల సెలబ్రిటీలు, నేతలు, ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా డీప్‌ఫేక్ బారిన పడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి కూడా డీప్‌ఫేక్ బారినపడ్డారు. మెగాస్టార్ చిరంజీవి ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసి వెబ్‌సైట్లు, సోషల్ మీడియాలో కేటుగాళ్లు పోస్ట్ చేశారు. దీంతో అవి వైరల్‌గా మారాయి. ఇది గమనించిన ఆయన వెంటనే సీపీ సజ్జనార్‌కు తాజాగా ఫిర్యాదు చేశారు. డీప్‌ఫేక్ వీడియోలు రూపొందిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చిరంజీవి విజ్ఞప్తి చేశారు. అయితే, ఈ వ్యవహారంపై తాజాగా సజ్జనార్ మాట్లాడుతూ చిరంజీవి డీప్‌ఫేక్ కేసులో విచారణ చేస్తున్నామని తెలిపారు. డీప్ ఫేక్ వీడియోలు, ఫొటోలు మార్ఫింగ్ వంటివి సమాజిక మాధ్యమాల్లో విపరీతంగా పెరుగుతున్నాయని అన్నారు. సెలబ్రిటీల ఫోటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసే కేటుగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి విచారణ చేస్తామని కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ టీమ్ ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో విచారణ చేపడుతుందన్నారు. ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే వారు తప్పించుకోలేరని, కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు.

# వీధి కుక్కల నియంత్రణకు చర్యలేవి

మొదటి పేజీ తరువాయి

ఎందుకు దాఖలు చేయలేదో వివరణ ఇవ్వాలని జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్వీ అంజరియాలతో కూడిన ముగ్గురు న్యాయమూర్తుల ప్రత్యేక ధర్మాసనం పేర్కొంది. లేకుంటే ఫెనాల్టితో పాటు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పశ్చిమబెంగాల్, తెలంగాణ, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మాత్రమే తమ అఫిడవిట్లు దాఖలు చేశాయని అయితే దీపావళి సెలవుల్లో కౌంటర్ దాఖలు చేసినందున అవి తమ రికార్డులో లేవని ధర్మాసనం పేర్కొంది. వీధికుక్కల సమస్యకు సంబంధించిన సుమోటో కేసులో గత ఆగస్టులో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. వీధి కుక్కల నియంత్రణ విషయంలో వాటిని పట్టుకుని శస్త్రచికిత్సచేసి తిరిగి వదిలే విధానాన్ని అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేస్తూ అఫిడవిట్లు దాఖలు చేయాలని సూచించింది. కానీ రాష్ట్రాలు ఇప్పటి వరకు స్పందించలేదు. ఈ పరిణామాలపై సోమవారం విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది.

# తేమ శాతం తనిఖీ చేసుకోండి



హైదరాబాద్, అక్టోబర్ 27 (తీన్మార్ న్యూస్): కొనుగోలు కేంద్రాలకు తీసుకురాకముందే పత్తిలో తేమ శాతాన్ని రైతులు తనిఖీ చేసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. తేమ శాతం 12కు మించకూడదని తేమ శాతం ఎక్కువైతే మద్దతు ధర లభించదన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తేమ శాతం ఎక్కువ ఉన్న కూడా పత్తిని కొనుగోలు చేయాలని కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నామని చెప్పారు. సోమవారం మంత్రి తుమ్మల ఓ ప్రకటన విడుదల చేశారు. పత్తి రైతులకు మద్దతు ధర కల్పించేందుకు మా ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని ఈ మేరకు సెప్టెంబర్ లోనే కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ చౌహాన్ కు లేఖ రాసినట్లు పేర్కొన్నారు. కపాస్ కిసాన్ యాప్లో రిజిస్ట్రర్ చేసుకోవడం కోసం ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారిక బృందాలు జిల్లాలో పర్యటిస్తుంటారని, ఏఈఓలు, మార్కెట్ సెక్రటరీలు, జిల్లా మార్కెటింగ్ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటారని తెలియజేశారు. పత్తి రైతుల కోసం టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశామని, రైతులకు ఎలాంటి సందేహాలు, ఫిర్యాదులు ఉన్నా టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 5779 ను వెంటనే సంప్రదించగలన్నారు.

# తెలంగాణకు “మొంథా” తుఫాను ఎఫెక్ట్

మొదటి పేజీ తరువాయి

అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ధాన్యం, పత్తి, మొక్క జొన్న కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులకు నష్టం జరగకుండా ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని అదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో సోమవారం సాయంత్రం 5 గంటలకు జిల్లా కలెక్టర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాగా బంగాళాఖాతం నుంచి ముంచుకొస్తున్న మొంథా తుఫాన్ కారణంగా తెలంగాణలో సోమవరం పలు జిల్లాల్లో వర్షం కురిసే అవకాశాలు ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు రెండె అలర్ట్ జారీ చేసింది. కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, ఖమ్మం, పెద్దపల్లి, వరంగల్, హనుమకొండతో పాటు మిగిలి నజిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ జారీ చేసింది.

# రేవంత్ రెడ్డితో సమావేశంలో టాలీవుడ్ కీలక నిర్ణయం



తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 27 (తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం నేపథ్యంలో టాలీవుడ్ కీలక నిర్ణయం తీసుకుంది. నేడు అన్ని తెలుగు సినిమాల షూటింగ్స్, పోస్ట్ ప్రొడక్షన్ పనులకు బ్రేక్ ఇవ్వాలని నిర్ణయించారు. అంతేకాదు మంగళవారం తెలుగు ఫిల్మ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి సన్మానం చేయబోతున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో ఈ సన్మాన కార్యక్రమం జరుగనుంది. కాగా, సినీ పరిశ్రమకు పూర్తిగా సహకారం అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. కానీ పరిశ్రమను నియంత్రించే పనులు ఎవరూ చేయొద్దని ఇది ప్రభుత్వం సహించదని స్పష్టం చేశారు. ఎవరైనా చట్ట పరిధిలో పనిచేయాల్సిందేనని ఇటీవల తనను కలిసిన నిర్మాతలు, దర్శకులకు స్పష్టం చేశారు. సినీ పరిశ్రమలో పని వాతావరణం బాగుండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

# మొంథా తుఫాను బీభత్సం.. ఏపీలో 54 రైళ్లు రద్దు

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 27 (తీన్మార్ న్యూస్): మొంథా తుఫాను ఏపీపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నేడు తుఫాను మచిలీపట్నం - కళింగపట్నం మధ్య తీరం దాటనుంది. ఇప్పటికే ఉత్తరాంధ్రతోపాటు పలు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. అయితే తుఫాను నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. విజయవాడ డివిజన్ మీదుగా ప్రయాణించాల్సిన 54 రైళ్లను రద్దు చేసింది. విజయవాడ, గుంటూరు, నర్సాపురం, కాకినాడ, విశాఖ, ఒంగోలు నుంచి మంగళవారం, బుధవారం బయలుదేరే ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసింది. వాటి గురించి ప్రయాణికుల మొబైల్స్‌కి సందేశాలు పంపింది.

# బాలికలు ఉన్నత చదువులు చదవాలి

## రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)

ములుగు జిల్లా, అక్టోబర్ 27 (తీన్మార్ న్యూస్): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య బోధన బాలికలు ఉన్నత చదువులు చదవాలి. బాలికల కోసమే కస్తూరిబా గాంధీ విద్యాలయాల ఏర్పాటు. పదవ తరగతి పరీక్షలలో రాష్ట్రంలో జిల్లాను మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేయాలి. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క. బాలికలు ఉన్నత చదువులు చదవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కస్తూరిబా గాంధీ విద్యాలయాల ఏర్పాటు ఏర్పాటు చేసి విద్యార్థినిలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, ప్రతి బాలిక ఉన్నత చదువులు చదవాలని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం ములుగు జిల్లా కేంద్రం లోని మాధవరావు పల్లి గ్రామంలో 2 కోట్ల 30 లక్షల నిధులతో నిర్మించిన కస్తూరిభా గాంధీ బాలికా విద్యాలయము తరగతి గదులు, ప్రయోగశాలలను కలెక్టర్ దివాకర్ టిఎస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గతంలో బాలికలకు విద్య అవసరం లేదనే సనాత ధర్మం పాటిస్తూ వంటగదిలకే పరిమితం చేశారని, నేడు మహిళలు అన్ని రంగాలలో ముందంజలో ఉన్నారని వివరించారు. దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు జ్యోతిరావు పూలే భార్య సావిత్రిబాయి విద్యా బోధన చేశారని, అప్పటి నుండి ఇప్పటి వరకు మహిళలు విద్యను బోధిస్తున్నారని తెలిపారు. బాలికలకు ప్రత్యేక పాఠశాలలు ఉండాలని ఉద్దేశంతో మహాత్మా గాంధీ సతీమణి కస్తూరిబా గాంధీ పేరుతో పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి ఒక్కరు ఎంత నేర్చుకున్నామనేది ముఖ్యం కాదని నేర్చుకున్న పరిజ్ఞానాన్ని పదిమందికి తెలపడమే గొప్ప విషయమని అన్నారు. తాను సైతం ప్రభుత్వ హాస్టల్లో ఉండి విద్యను అభ్యసించానని, ప్రతి బాలిక తమ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన అందించడం జరుగుతుందని తెలిపారు. రానున్న పదవ తరగతి పరీక్షలలో రాష్ట్రంలో జిల్లాను మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేశామని, నేడు బాలికలకు నూతన భవనం నిర్మాణంతో తరగతి గదులు, ప్రయోగశాలల అన్ని సమస్యలు తీరిపోయాయని తెలిపారు. విద్యా బోధనలు చేసిన ఉపాధ్యాయురాలు తమ స్వంత పిల్లల లాగానే విద్యను అభ్యసిస్తున్న బాలికలను చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ ఈ ఎడ్యుకేషన్ ఇంజనీర్ అరుణ్ కుమార్, డిఈఓ సిద్ధార్థ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



ములుగు జిల్లా, అక్టోబర్ 27 (తీన్మార్ న్యూస్): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ రోజు ప్రజావాణి కార్యక్రమంలో 61 దరఖాస్తులు రాగా అత్యధికంగా భూ సమస్యలు 19, గృహ నిర్మాణ శాఖకు 10 పెన్షన్ 05, ఉపాధి కల్పనకు 04, ఇతర ఇతర శాఖలకు సంబంధించినవి 23 దరఖాస్తుల స్వీకరించగా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబని పరామర్శించిన బడే నాగజ్యోతి



గోవిందరావు పేట, అక్టోబర్ 27 (తీన్మార్ న్యూస్): పస్రా గ్రామ %దీ=ూ% పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు తాటికొండ శ్రీనివాస్ మాతృ మూర్తి అయిన తాటికొండ గోవిందమ్మ మరణించగా వారి నివాసానికి వెళ్ళి ములుగు నియోజకవర్గ బీ ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ బడే నాగజ్యోతి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గోవిందరావు పేట మండలం పార్టీ అధ్యక్షులు లకవత్ నరసింహనాయక్ మాజీ ఎంపీటీసీలు రామచంద్రనాయక్ చందూలాల్ శ్రీనివాసరావు స్వరూప సీనియర్ నాయకులు అజ్మీర సురేష్ అల్లం నేనే హనుమంతరావు మాలోతు గాంధీ దర్శనాల సంజీవ నాగక్క స్వామి మాజీ సర్పంచులు మోహన్ రాథోడ్ రాకేష్ బొల్లాం శివ అబ్దుల్ అజీజ్ కొమరం సిద్దు తదితరులు పాల్గొన్నారు

# గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వలన వెనుకబడిన అభివృద్ధి

### అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలి

### పట్టణ సుందరీకరణ నా లక్ష్యం

### పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి



పరకాల, అక్టోబర్ 27 (తీన్మార్ న్యూస్): సోమవారం పరకాల పట్టణ కేంద్రంలోని 1,2,12,13,14 వార్డులలో అధికారులు మరియు స్థానికులతో కలిసి సైడ్ డ్రైనేజ్, పారిశుద్ధ్య,రోడ్డు నిర్మాణ పనులను పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు ప్రత్యక్షంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరకాల పట్టణం ముంపుకు గురి కాకుండా ప్రణాళికాబద్ధంగా అంచలవారిగా నగరాన్ని తలపించేలా సుందరీ కరణ చేసి అభివృద్ధి చేస్తానని అందుకు ప్రజల సహకారం అవసరమని అన్నారు. టి యు ఎఫ్ ఐ డి సి నిధుల ద్వారా చేపట్టిన అభివృద్ధి నిర్మాణ పనులను త్వరితగతన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని అన్నారు. గతంలో వచ్చిన నిధులు సక్రమంగా ఉపయోగించుకోకపోవడం వల్ల నిరుపయోగం అయ్యాయని తెలిపారు.గత ప్రభుత్వ పాలకులు వర్షపు నీరు పారుదల డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయకుండా నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. తను ఎమ్మెల్యే అయిన తర్వాత ఒక ప్రత్యేకమైన డి పి ఆర్ వ్యవస్థతో డ్రైనేజీ రోడ్లు తాగునీటి వ్యవస్థను వచ్చే 40 సంవత్సరాలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పూర్తిస్థాయిలో ఉపయోగిస్తున్నామన్నారు.పరకాల పట్టణాన్ని ఆరు జోన్లుగా విభజించి జనన ఆధారంగా వచ్చిన నిధులను పూర్తిస్థాయిలో ఉపయోగిస్తున్నామన్నారు. 3,4,6 జోన్లో మొదటి ఫేజ్ లో,1,2,5 జోన్లు 2 ఫేస్ లో అభివృద్ధి చేస్తామన్నారు. పరకాలను విద్యా కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, ఇందులో భాగంగానే యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, టాస్క్, ఇండోర్ స్టేడియం అభివృద్ధి, స్విమ్మింగ్ పూల్, ఏర్పాటు చేస్తున్నామన్నారు.



# 4వ బెటాలియన్ సిబ్బంది మ్యూజికల్ బ్యాండ్ షో

మామునూరు, అక్టోబర్ 27 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లా మామునూరు నాలుగో బెటాలియన్లో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా హన్మకొండ పబ్లిక్ గార్డెన్ లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో కమాండెంట్ డి. శివ ప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు సిబ్బంది మ్యూజికల్ బ్యాండ్ షోను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంకు అసిస్టెంట్ కమాండెంట్ శ్రీ కృష్ణ ప్రసాద్ మరియు హన్మకొండ ఏసీపీ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ మాట్లాడుతూ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, పోలీస్ అమరవీరుల త్యాగం మరువలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ విజయ్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ రాజారామ్, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజావాణి పిర్యాదులకు చర్యలు తీసుకోవాలి

## అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 27 (తీన్మార్ న్యూస్): ప్రజావాణిలో వచ్చినా సమస్యలు పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదుల దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి మొత్తం 36 దరఖాస్తులు స్వీకరించామని, వాటిని సంబంధిత శాఖాధికారులకు తక్షణ పరిష్కారానికి ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలనే ఉద్దేశంతో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అధికారులు ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతగా తీసుకోవాలని, తీసుకున్న చర్యలపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీఓ రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రులు మహిళా అధికారులను వేధిస్తున్నారు

కరీంనగర్, అక్టోబర్ 27 (తీన్మార్ న్యూస్): కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ కేబినెట్లోని కొందరు మంత్రులు మహిళా అధికారులను ఇంటికి పిలిపించుకుని ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. పాలనలో ప్రజలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఎంఐఎంకు చెందిన రౌడీషీటర్లు పోలీసులను చంపినా, హత్యాయత్నం చేసే స్థాయికి పెట్రేగిపోతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోందన్నారు. జూబ్లీహిల్స్లో ఒకవర్గం ఓట్ల కోసం ఎంఐఎం కాళ్లు పట్టుకునే స్థాయికి కాంగ్రెస్ పార్టీ దిగజారిపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులోకి రావాలంటే యూపీ తరహాలో రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. సర్దార్ వల్లభాయి పటేల్ 150 జయంతి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 31 నుండి నవంబర్ 25 వరకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతున్న నేపథ్యంలో సోమవారం కరీంనగర్లోని మేరా యువ భారత్ కార్యాలయంలో మాజీ మేయర్ సునీల్ రావు, బీజేపీ కరీంనగర్, సిరిసిల్ల అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపి తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు, భారత దేశ ఐక్యత కోసం తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడు, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయిపటేల్ జన్మించి ఈనెల 31 నాటికి 150 ఏళ్లు. సర్దార్ వల్లభాయి పటేల్ ఆనాడు దేశంలోని 560 సంస్థానాలను ఒక్క జెండా కిందకు తీసుకొచ్చి భారతదేశాన్ని ఏకం చేశారు. భారత్ తోనే కాదు తెలంగాణతోనూ ఉన్న అనుబంధం గురించి ఈ తరానికి తెలియజేయాల్సిన అవసరం కూడా ఉంది. పటేల్ లేకపోతే తెలంగాణకు విముక్తి కలిగేది కాదు. తెలంగాణను పాకిస్తాన్లో కలపాలని లేదా ముస్లిం దేశంగా మార్చాలని ఆనాడు నిజాం రాజు కుట్రలు చేసిండు. ఒకవేళ తెలంగాణ భారత్లో విలీనం కాకుండా మన పరిస్థితి ఎట్లుండేదో ఒక్క క్షణం ఆలోచించండి. మరో పాకిస్తాన్, మరో శ్రీలంక, మరో బంగ్లాదేశ్లా మారి ఆకలి కేకలతో కల్లోల దేశంగా మారేది. ఇది ఆనాడే గ్రహించిన పటేల్ తెలంగాణకు స్వాతంత్ర్యం రాకుండా స్వతంత్ర్య రాజ్యంగా ఉంటే భారతమాత కడుపులో కేన్సర్ ఉన్నట్లేనని ప్రకటించి నిజాం కుట్రలను భగ్నం చేసి తెలంగాణకు విముక్తి కల్పించిన సర్దార్ పటేల్ మనందరికీ ఆరాధ్యుడు.

అలాంటి మహనీయుడిని 150 జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ స్మరించుకునేలా, ఆయన సిద్దాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలనే ఉద్దేశంతోనే దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అక్టోబర్ 31 నుండి నవంబర్ 25 వరకు "సర్దార్ఏ150 ఐక్యతా మార్చ్" పేరిట అనేక కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించింది. ప్రతి జిల్లాలో విద్యార్థులను, యువతతో కలిసి పాదయాత్రలు చేయాలని సంకల్పించింది. సర్దార్ పటేల్ జన్మస్థలమైన కరంసాద్ నుండి స్టాచ్యూ ఆఫ్ యూనిటీ (కేవాడియా) వరకు మొత్తం 152 కి.మీ.ల మేరకు జాతీయ పాదయాత్ర (నవంబర్ 26 నుండి డిసెంబర్ 6 వరకు) నిర్వహిస్తారు. ప్రధానమంత్రి మోడీ ఒకరోజు జాతీయ పాదయాత్రలో పాల్గొంటారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజవర్గ పరిధిలో "సర్దార్ఏ150 ఐక్యతా మార్చ్" పేరిట జరిగే పాదయాత్రలో నేనూ పాల్గొంటాను. సర్దార్ పటేల్ ఈ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించి యువతలో ఐక్యతా స్ఫూర్తిని నింపాలని మీడియాను, సోషల్ మీడియా వారియర్స్ను కోరుతున్నా. రాష్ట్ర కేబినెట్లోని కొందరు మంత్రులు మహిళా అధికారులను రాత్రిపూట ఇండ్లకు, ఆఫీసులకు పిలిపించుకుని వేధిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. కష్టపడి చదువుకుని ఉద్యోగాల్లో చేరి విధులు నిర్వహిస్తున్న మహిళలను గౌరవించాల్సింది పోయి అవమానించేలా వ్యవహరించడం సరికాదు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే విచారణ జరిపించి నివేదిక తెప్పించుకోవాలి. బాధ్యులైన మంత్రులను బర్త్ రఫ్ చేయాలి.

ఇప్పటికే కాంగ్రెస్ పాలన అంటేనే మహిళలు అసహ్యించుకునే పరిస్థితి ఉంది. అవినీతి, అరాచకాలు జరుగుతున్నాయి. ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలేశారు. ముఖ్యంగా మహిళలకు ప్రతినెలా రూ.2500లు, తులం బంగారం, స్కూటీ ఇస్తానని మోసం చేశారు. వీటికి తోడు శాంతి భద్రతలు అదుపు తప్పుతున్నాయి. సాక్షాత్తు పోలీసులపై దాడులు చేస్తున్నరు. మొన్న నిజామాబాద్లో మజ్లిస్ రౌడీషీటర్ కానిస్టేబుల్ను చంపేశారు. నిన్న హైదరాబాద్ నడిబొడ్డున డీసీపీ చైతన్య, కానిస్టేబుల్పై ఎంఐఎం రౌడీషిటర్ దాడి చేసి హత్యాయత్నం చేసినా దిక్కు లేదు. గోరక్షులపై కాల్పులు జరిపి చంపేందుకు యత్నిస్తున్నారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ల రాజకీయం మానుకోవాలి. డీసీపీ చైతన్యపై హత్యాయత్నం చేసిన రౌడీషీటర్పై కఠినాతి కఠినంగా చర్యలు తీసుకోవాలి. యూపీ ప్రభుత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపాలి. అక్కడ రౌడీషీటర్లకు బెయిల్ వచ్చినా బయటకు రాకుండా జైల్లోనే ఉండే పరిస్థితి. అట్లాంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటే తప్ప రౌడీషీటర్లను కంట్రోల్ చేయాలి. దురదృష్టం ఏమిటంటే రాష్ట్ర ముఖ్యమంత్రే నక్సలిజం నా ఫిలాసఫీ అంటారు. ఒవైసీ మంచోడని అంటారు. అక్బరుద్దీన్ ఒవైసీ కొడంగల్లో పోటీ చేస్తే గెలిపిస్తానని అంటారు. ఇది సరికాదు. శాంతిభద్రతలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నా అని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# ఒక శాతం రక్త దానానికి ప్రజలందరూ సిద్ధంగా ఉండాలి

### రక్తదానం అంటే ప్రాణాలను కాపాడటమే


### తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి




హైదరాబాద్, అక్టోబర్ 27 (తీన్మార్ న్యూస్): రక్తదానం చేయడం అంటే ఇతరుల ప్రాణాలను కాపాడటమే అని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. రోగుల అవసరానికి తగ్గట్టుగా జనాభాలో ఒక శాతం రక్తాన్ని దానం చేయడంలో ప్రజలందరూ సిద్ధంగా ఉండాలని చెప్పుకొచ్చారు. ఒక్క యూనిట్ రక్తం ముగ్గురు ప్రాణాలు కాపాడుతుందన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో మెగా బ్లడ్ డొనేట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ పాల్గొన్నారు. అనంతరం, డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల పలు రకాలుగా రక్తం ప్రజల ప్రాణాలు కాపాడడానికి ఉపయోగపడుతుంది. ప్రతీ యేటా నాలుగు సార్లు బ్లడ్ ఇచ్చే అవకాశం ఉంటుంది. సమాజంలో రోడ్డు ప్రమాదాలలో గాయపడే వారికి ఈ రక్తం అవసరం ఉంటుంది. రాష్ట్రంలో ఒక ఏడాదిలో ఎనిమిది వేల మంది చనిపోయారు. వారిలో రక్తం లేక చనిపోయిన వారే ఎక్కువగా ఉన్నారు. రోగుల అవసరానికి తగ్గట్టుగా జనాభాలో ఒక శాతం రక్తాన్ని దానం చెయ్యడంలో ప్రజలందరూ ముందుండాలి. రక్తదానం చేసే గొప్ప కార్యక్రమం నిర్వహించిన సీపీ సజ్జనార్‌కు అభినందనలు తెలిపారు. గతంలో కోవిడ్ సమయంలో సైబరాబాద్ సీపీగా సజ్జనార్ ప్రజలకు అందించిన సేవలను డీజీపీ కొనియాడారు.

మరోవైపు సీపీ సజ్జనార్ మాట్లాడుతూ నగరంలో అన్ని జోన్లలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశాం. తొమ్మిది క్యాంపుల ద్వారా 3,500 యూనిట్స్ టార్గెట్ పెట్టుకొని శిబిరాలు ఏర్పాటు చేశాం. పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగాలకు నివాళిగా మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. రక్తం అందక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రజలు సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. రోడ్డు ప్రమాదాలు, ఎమర్జెన్సీలో ఆపరేషన్‌లో రక్తం అవసరం ఉంటుందన్నారు. తలసేమియా వ్యాధితో చాలామంది బాధ పడుతున్నారు. పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన బ్లడ్ యూనిట్స్‌ను వాళ్లకు అందజేస్తామని తెలిపారు.

# ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి




- బాకీపడ్డ 24 వేలు ఒక్కొక్కరి ఖాతాలో వేయాలి
- ఆటో డ్రైవర్లకు మద్దతుగా హరీష్ రావు డిమాండ్

**హైదరాబాద్, అక్టోబర్ 27:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్ల పరిస్థితి పూర్తి అధ్వానంగా తయారైందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. అధికారంలోకి వచ్చి రెండేండ్లయినా ఆటో కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామినీ రేవంత్ రెడ్డి అమలు చేయలేదని మండిపడ్డారు. ఆటో కార్మికులకు బాకీ పడిన రూ.24 వేలు ఎంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే హామీని నెరవేరుస్తారని చెప్పారు. కోకాపేటలోని తన నివాసం నుంచి ఎర్రగడ్డకు, అక్కడి నుంచి తెలంగాణ భవన్ వరకు హరీశ్ రావు ఆటోలో ప్రయాణించారు. అనంతరం మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు ఆందోళనలో ఉన్నారు. రైతులు, చిరు ఉద్యోగులు, మహిళలు, ఆటో డ్రైవర్లు కావచ్చు.. అందరూ ఆవేదనలో ఉన్నారు. ఆటో డ్రైవర్ల పరిస్థితి మరీ ఆందోళనకరంగా ఉంది. పేరుకి ఉచిత బస్సు అన్నారు, మహిళలకు ఫ్రీ అన్నారు. మొగోళ్ళకి డబల్ టికెట్ కొడుతున్నారు. టికెట్ రేట్లు పెంచి కుటుంబం మీద భారం వేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఐదుసార్లు బస్ చార్జీలు పెంచింది. రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారంలో హైదరాబాద్‌కి వచ్చి సినిమా నటులకంటే ఎక్కువ యాక్టింగ్ చేశారు. చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీలో మెట్ల మీద కూర్చొని కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మొదటి ఏడాది 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేశారు. నిరుద్యోగులను వాడుకొని ఓట్లు, డబ్బులు తీసుకొని.. నిరుద్యోగ యువతీ యువకులను వదిలేశారు. నాడు రాహుల్ గాంధీ హైదరాబాద్ వచ్చి ఇదే యూసఫ్‌గూడా జూబ్లీహిల్స్‌లో ఆటో ఎక్కి ఆటో కార్మికులకు అరచేతిలో వైకుంఠం చూపించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.12 వేలు ఇస్తామని చెప్పారు. ఆటోనగర్, ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. ఆటోనగర్ అసలే లేదు. ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంచుతామని పత్తా లేదు. ఇస్తామన్న రూ.12 వేలకి దిక్కు లేదు. రాష్ట్రంలో ఉన్న 5 నుంచి 6 లక్షల ఆటోలకు కాంగ్రెస్ పార్టీ ఒక్కొక్క ఆటోకు రూ.24 వేలు బాకీ పడింది. ఆ మొత్తాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు వాటాల కోసం తన్నుకుంటున్నారు. వాటికోసం పైసలు ఉన్నాయి. కానీ ఆటో కార్మికులకు నెలకు రూ.1000 ఇవ్వడానికి లేవా?. రేవంత్ రెడ్డి నెల నెల మూటలు మోస్తూ ఢిల్లీకి కప్పం కడుతున్నాడు. ఆటో డ్రైవర్లు అంటే ఎందుకు అంత చిన్న చూపు. లక్ష కోట్లతో మూసీ సుందరీకరణ చేస్తున్నాం, లక్ష కోట్లతో ఫోర్త్ సిటీ నిర్మిస్తానంటున్నావు. కానీ ఆటో డ్రైవర్లకు నెలకు రూ.1000 ఇవ్వలేవా రేవంత్ రెడ్డి అంటూ ప్రశ్నించారు. మరోసారి రాహుల్ గాంధీ హైదరాబాద్ వస్తే శంషాబాద్‌లో ఆటోలతో నిరసన తెలుపుతాం. రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆటో కార్మికుల బాధ తెలవాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఆటోల నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. వెంటనే బాకీ పడ్డ రూ.24 వేలు ప్రతి ఆటో డ్రైవర్‌కి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. రూ.3 లక్షలు ఫీజు పెంచితే మద్యం టెండర్లపై రూ.3 వేల కోట్లు ప్రభుత్వానికి వచ్చాయి. అందులో నుంచి రూ.1500 కోట్లు ఆటో కార్మికులకు ఇచ్చి వారిని కాపాడాలని డిమాండ్ చేచేశారు. ఇప్పటివరకు 161 మంది ఆటో కార్మికులు చనిపోయారు. ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయి. చనిపోయిన ఆటో డ్రైవర్ కుటుంబానికి ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలన్నారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. తప్పకుండా మిమ్మల్ని కాపాడుకుంటాం. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఆటో కార్మికులు ఎక్కడ ఉన్నా కాంగ్రెస్‌ని ఓడించేలా పనిచేయండని పిలుపునిచ్చారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై సీఈసీ కీలక ప్రకటన

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 27 (తీన్మార్ న్యూస్): దొంగ ఓట్లను గుర్తించడానికి, వాటిని సరిచేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనే కొత్త కార్యక్రమాన్ని మొదలుపెట్టబోతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ విజయవంతంగా పూర్తయిందని స్పష్టం చేసింది. మరో 12 రాష్ట్రాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించబోతున్నట్లు తెలిపింది. ఈ సర్వేలో చనిపోయిన వారు, బదిలీ చేయబడిన వారి ఓటర్లను తొలగిస్తున్నట్లు చెప్పింది. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే %వా×=% కార్యక్రమ లక్ష్యమని వెల్లడించింది. దేశ వ్యాప్తంగా ప్రతీ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాలో సవరణలు తప్పనిసరి అని పేర్కొంది. గతంలో 21 ఏళ్ల క్రితం ఓటర్ల జాబితా సవరణ జరిగిందని గుర్తుచేసింది. ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో ఈ అర్ధరాత్రి నుంచే ఓటర్ల జాబితా సీజ్ చేస్తామని సీఈసీ కీలక ప్రకటన చేసింది.




# మానవ హక్కుల కమిషన్‌కు రియాజ్ కుటుంబం ఫిర్యాదు

**వేధింపులు, థర్డ్ డిగ్రీ ప్రయోగంపై వివరణ కోరిన కమిషన్**

**రియాజ్‌ను స్వగ్రామంలోకి రానివ్వకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని ఆరోపణ**

**కానిస్టేబుల్ తో లావాదేవీల విషయంలో గొడవలున్నాయని వెల్లడి**

**రూ. 3 లక్షలు డిమాండ్ చేశారని రియాజ్ భార్య ఫిర్యాదు**

**సుమోటోగా స్వీకరించిన హెచ్ఆర్సీ.. నివేదిక సమర్పణపై కీలక ఆదేశాలు**



హైదరాబాద్, అక్టోబర్ 27 (తీన్మార్ న్యూస్): ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన షేక్ రియాజ్ కుటుంబ సభ్యులు సోమవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ను ఆశ్రయించారు. తన కొడుకు ఎన్‌కౌంటర్‌కు దారి తీసిన పరిస్థితులు, ఆ తరువాత పోలీసులు తమను వేధిస్తున్న తీరుపై రియాజ్ తల్లి, భార్య, పిల్లలు కమిషన్ చైర్మన్ జస్టిస్ షామీమ్ అక్తర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో రియాజ్ కుటుంబ సభ్యులు తమను స్వగ్రామంలోకి కూడా రానివ్వకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని, తీవ్రంగా వేధింపులకు గురిచేస్తూ థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారని కమిషన్‌కు వివరించారు. మరణించిన కానిస్టేబుల్ ప్రమోద్‌తో రియాజ్‌కు ఆర్థిక లావాదేవీల విషయంలో గొడవలు ఉన్నాయని రియాజ్ కుటుంబ సభ్యులు కమిషన్‌కు వివరించారు. రియాజ్ భార్య తన ఫిర్యాదులో కానిస్టేబుల్ ప్రమోద్ ఒక కేసు విషయంలో రియాజ్‌ను రూ. 3 లక్షలు డిమాండ్ చేశారని రియాజ్ అప్పటికప్పుడు రూ. 30 వేలు చెల్లించాడని తెలుపుతూ మిగతా డబ్బులు ఇవ్వాలని ప్రమోద్ రియాజ్‌ను తీవ్రంగా వేధించారని ఆరోపించింది. ఇకపోతే ఈ ఎన్‌కౌంటర్ ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ గతంలోనే సుమోటోగా కేసు స్వీకరించింది. దీనికి సంబంధించిన సమగ్ర నివేదికను వచ్చే నెల (నవంబర్) 24వ తేదీలోపు సమర్పించాలని రాష్ట్ర డీజీపీకి కమిషన్ చైర్మన్ జస్టిస్ షామీమ్ అక్తర్ ఆదేశించారు. తాజాగా, రియాజ్ కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదును పరిగణలోకి తీసుకున్న కమిషన్ చైర్మన్ నివేదిక సమర్పణ గడువును మరింత తగ్గిస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. వచ్చే నెల 3వ తేదీలోపు నివేదికను సమర్పించాలని డీజీపీని ఆదేశించారు. ఈ ఎన్‌కౌంటర్ వ్యవహారం, కుటుంబ సభ్యుల ఫిర్యాదు దృష్ట్యా రాష్ట్ర పోలీసులకు మరింత త్వరగా నివేదిక ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టుపై ప్రభుత్వం కీలక నిర్ణయం

**తక్కువ ఖర్చుతో కూడిన ప్రత్యామ్నాయాలపై దృష్టి**

**సుందిళ్ల లింక్ ద్వారా సవరించిన ప్రణాళికపై అధ్యయనం**

**ప్రాజెక్టు వ్యయం 10 నుండి 12 శాతం వరకు తగ్గుదల**

**భూసేకరణ దాదాపు సగానికి తగ్గుతుందని వెల్లడి**

**సవరించిన ప్లాన్ ద్వారా 1,600 కోట్ల వరకు ఆదా**

**ప్రాజెక్టు పునరుద్ధరణపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష**



హైదరాబాద్, అక్టోబర్ 27 (తీన్మార్ న్యూస్): ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయంపై తీసుకుంది. సోమవారం నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును సాంకేతికంగా, ఆర్థికంగా పునరుద్ధరించేందుకు తక్కువ ఖర్చుతో కూడిన ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి సుందిళ్ల లింక్ ద్వారా సవరించిన సాధ్యాసాధ్యాలను ప్రభుత్వం అధ్యయనం చేసిందని వెల్లడించారు. సవరించిన ప్రణాళిక వల్ల ప్రాజెక్టు వ్యయం దాదాపు 10 నుండి 12 శాతం వరకు తగ్గుతుందని మంత్రి తెలియజేశారు. భూసేకరణ కూడా దాదాపు సగానికి తగ్గుతుందని, మునుపటి ప్రణాళికలతో పోలిస్తే సుమారు రూ.1,500 నుంచి 1,600 కోట్ల వరకు ఆదా చేస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా వివరించారు.

# బీఆర్ఎస్‌కు భారీ షాక్




హైదరాబాద్, అక్టోబర్ 27 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ పార్టీకి వచ్చే విరాళాలు భారీగా తగ్గిపోయాయి. గులాబీ పార్టీ ప్రతిపక్షంలోకి రాగానే ఆ పార్టీకి వచ్చే విరాళాలు 97.4% తగ్గిపోయినట్టు సమాచారం. ఈసీకి సమ్పరించిన ఆడిట్ ప్రకారం 2024-25లో కేవలం రూ.15.09 కోట్లు మాత్రమే ఫండ్స్ గా వచ్చినట్టు గులాబీ పార్టీ పేర్కొంది. ప్రోగ్రెసివ్ ఎలక్ట్రోరల్ ట్రస్ట్ నుంచి రూ.10 కోట్లు, ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి రూ.5 కోట్ల విరాళాలు మాత్రమే అందినట్టు తెలిపింది. కాగా 2023-24లో ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీఆర్ఎస్ పార్టీకి రూ.580.52 కోట్లు రాగా ఈసారి అవి ఏకంగా 97.4 శాతానికి పడిపోవడం గమనార్హం.



# తీరు మార్చుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

ఎలుకతోలు తెచ్చి ఎన్నేళ్లు ఉతికినా...నలుపునలుపేగాని తెలుపు గాదయా అని సామెత. కాంగ్రెస్ పార్టీకి ఇది బాగా సరిపోతుంది. కెసిఆర్‌పై అసహనం, కెటిఆర్ రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరించడం..కుటుంబ పాలనా పెత్తనం వంటివన్నీ సహించలేక బిఆర్‌ఎస్ పాలనపై విసుగుతో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారు తప్ప.. కాంగ్రెస్ హామీలపైనో లేదా రేవంత్‌పై ప్రేమతోనో లేదా..రాహుల్, సోనియాలపై భక్తితోనే ప్రజలు ఓట్లు వేయలేదు. అలాగే బిజెపి ఆడిన నాటకాలు కూడా ప్రజలు తిరస్కరించారు. బండి సంజయ్ రాకతో బిజెపి మంచి స్థితికి వచ్చింది. కానీ బిజెపి అధ్యక్షుడిగా సంజయ్‌ను తలగించడం, కెసిఆర్‌తో లోపాయకారి ఒప్పందం చేసుకోవడం వంటి కారణాలతో కూడా బిజెపికి దక్కాల్సిన అధికారం కాంగ్రెస్‌కు దక్కింది. ఇవన్నీ నిజాలు. కానీ కాంగ్రెస్ పార్టీ ఇవన్నీ మరచిపోయి పాలన సాగిస్తోంది. బిఆర్‌ఎస్ పాపాలను విమర్శిస్తున్న వీరు తాము కూడా అదేపనిలో ఉన్నారు. పైరవీలు, పర్సెంటేజీలు, బెదరింపులు వంటి వ్యవహారాలపై బలంగా ప్రచారం సాగుతోంది. ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు ఒక్కటంటే ఒక్కటి తీసుకోవడం లేదు. ఆరు గ్యారెంటీలు, అప్పులు తప్ప చేసిన నిర్ణయాత్మక కార్యక్రమాలు లేవు. మంత్రుల్లో అనైక్యత కారణంగా పనులు సాగడం లేదు. గుంటల రోడ్లను కూడా పూడ్చలేని అసమర్థత కనిపిస్తోంది. కాంగ్రెస్ రాజకీయాలు గతంలో కూడా ఇలాగే ఉండేవి. అందుకే ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించారు. ఉమ్మడి ఎపిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి అధికారం చేపట్టాక కాంగ్రెస్ మార్కు రాజకీయాలను ప్రజలు మరచిపోయేలా చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 2004లో ముఖ్యమంత్రి అయిన రాజశేఖరరెడ్డి పార్టీ పైన, ప్రభుత్వంపైన పూర్తి పట్టు సాధించారు. దీంతో కాంగ్రెస్‌లో అసంతృప్త స్వరాలు, పాత జమానా తాలూకు వ్యవహారాలు కనపించకుండా పోయాయి. ప్రభుత్వంపై వైఎస్ తనదైన ముద్ర వేశారు. రాజశేఖరరెడ్డి కూడా కాంగ్రెస్‌ను ప్రాంతీయ పార్టీ స్థాయిలోనే నడిపారు. ఏక వ్యక్తి పాలనకు, ప్రాంతీయ పార్టీల కల్చర్‌కు అలవాటుపడిన తెలుగు ప్రజలకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు జీర్ణించుకోవడం లేదు. ఇటు ప్రభుత్వంలో, అటు పార్టీలో దశా దిశా లేకుండా పోయిందన్న అభిప్రాయం ప్రజల్లో ఏర్పడుతోంది. క్షేత్రస్థాయిలో పనులు కావడం లేదని సొంత పార్టీ ఎమ్మెల్యేలే గట్టిగా స్వరం వినిపిస్తున్నారు. మరోవైపు నిధుల కొరత కారణంగా చిన్న చిన్న పనులు కూడా మంజూరు చేయించలేని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ పరిణామాలతో వారిలో అసంతృప్తి చోటుచేసుకుంటోంది. ప్రభుత్వంలోనే కాదు, పార్టీలోనూ సిఎం రేవంత్‌రెడ్డికి పట్టు లేదన్న అభిప్రాయం బలపడుతోంది. ఎన్నికలకు ముందు రేవంత్ మాటతీరు, హామీల తీరు చూసి రేవంత్ రెడ్డి కూడా అలాగే వ్యవహరిస్తారనీ, కొత్తగా సంచనల నిర్ణయాలతో ముందుకు సాగాలని ఆశించారు. అయితే, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. సురేఖ దంపతులపై ప్రజల్లో ముందునుంచీ సదభిప్రాయం లేదు. తాజా వ్యవహారంలో ఆమెపై చర్యలు తప్పవని అంతా భావించారు. ఆమె కుమార్తె అన్న మాటలకు సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసి ఉండాలి. అయితే పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చొరవ తీసుకొని కొండా సురేఖను ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లారు. దీంతో ఆయన అప్పటికి శాంతించారు. నిజంగానే చర్యలు తీసుకుని ఉంటే కాంగ్రెస్ ఇమేజ్ పెరిగేది. సురేఖ దంపతులతో రేవంత్‌రెడ్డి రాజీ కుదుర్చు కున్నారన్న అభిప్రాయం ప్రజల్లో అసంతృప్తిని కలిగించింది. మరో వైపు మంత్రులు ఎవరికి వారు సర్వ స్వతంత్రులుగా వ్యవహరిస్తున్నారు. ఆ శాఖ, ఈ శాఖ అని లేకుండా అన్ని శాఖల్లో జోక్యం చేసుకుంటు న్నారని అంటున్నారు. ఎవరికి వారు ముఖ్యమంత్రులుగా భావించి వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రిని ప్రైవేట్ సందర్భాల్లో విమర్శిస్తున్న వారు కూడా ఉన్నారు. దీనికితోడు ప్రభుత్వంలో వివిధ స్థాయిలలో అవినీతి పెరిగిపోయింది. గ్రామపంచాయితీ లెవల్లో వేయి చేతిలో పెట్టనిదే ఏ పనీ జరగడం లేదు. ఎసిబి దాడులు చేస్తున్నా పిసరింత ప్రభావం కూడా కనిపించడం లేదు. ఉద్యోగుల అవినీతిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. కానీ అలా జరగడం లేదు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రులపై పట్టు లేదన్న వాదన బలపడింది. ఇకపోతే గందరగోళ నిర్ణయాలకు తోడు, అదేపనిగా గత బిఆర్‌ఎస్‌పై విమర్శలు చేస్తూ సాగుతున్నారు. దానిబదులు ఏదైనా అవినీతిపై గట్టి చర్య తీసుకుని ఉంటే ప్రభుత్వ ఇమేజ్ పెరగి ఉండేది. అలా కాకుండా కాంగ్రెస్ అధిష్టానానికి సంచులు మోస్తున్నారన్న ప్రచారం గ్రమస్థాయిలో నాటుకు పోచింది. ఇక ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు కూడా బెడిసి కొడుతున్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలన్న నిర్ణయం విషయంలో అపరిపక్వత బయటపడింది. ప్రజల్లో చులకన అయ్యారు. ముందూ వెనుకా ఆలోచించకుండా, చట్టపరమైన సమస్యలను అధ్యయనం చేయకుండా నిర్ణయం తీసుకోవడంతో ప్రభుత్వం అభాసుపాలయ్యింది. 42 శాతం రిజర్వేషన్లు ఇప్పించే బాధ్యత బిజెపిదేనంటూ దానిపై నెపాన్ని మోపడం కూడా చేతకానితనాన్ని రుజువు చేసింది. 42శాతం హామీ ఇచ్చింది కాంగ్రెస్ అయితే దానికి బిజెపిని బద్నాం చేయడం కూడా ప్రజలకు రుచించడం లేదు. పర్యవసానాలు ఆలోచించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని నిర్ణయం తీసుకుంది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పు అమలులో ఉన్నందున ప్రభుత్వ నిర్ణయాన్ని కోర్టులు కొట్టిపారేశాయి. దీంతో బీసీల ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. రిజర్వేషన్లు పెంచడానికి అసెంబ్లీలో మద్దతు ప్రకటించిన రాజకీయ పార్టీలు ఇప్పుడు బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వంపైకి నెట్టి తప్పుకొంటున్నాయి. ఫలితంగా ఈ సమస్య పరిష్కార బాధ్యత ప్రభుత్వంపై పడింది. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయం సాధిస్తే కొంత ఇమేజ్ పెరుగుతుంది. లేదంటే అతఃపాతాళానికి పతనం తప్పదు. బిసికి టిక్కెట్ ఇచ్చి ప్రచారం చేస్తున్నా.. ఫలితం అందుకు విరుద్ధంగా ఉంటే మాత్రం ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మరింత పెరుగుతుంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకుని బాధ్యతగా ముందుకు నడిపించాల్సిన ర ఆహుల్ సొంత రాజకీయాలతో మునిగి పోయారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలను చూసీచూడనట్లుగా పోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పార్టీ పుట్టి మునగడం ఖాయం. ఎందుకంటే కాంగ్రెస్ పాలనాతీరు చూస్తున్న ప్రజలు కెసిఆర్ నయం అన్న భావనకు వస్తున్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ మారకుంటే కాంగ్రెస్ పార్టీ మళ్లీ తెలంగాణలో ఇక అధికారంలోకి రావడం కల్ల.

# దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ

- త్వరలో ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో నిర్వహణ
- కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్




**న్యూఢిల్లీ, అక్టోబర్ 27:** దేశవ్యాప్తంగా ఎన్నికల జాబితాలలో సవరణలను చేపట్టనున్నట్టు కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ప్రకటించారు. తొలిదశ బీహార్‌లో విజయవంతంగా ముగిసిందని మలిదశ త్వరలో ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాల్లో నిర్వహిస్తామని అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ వివరాలను సీఈసీ వెల్లడించారు. రెండో విడతలో 9 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలు ఉంటాయని చెప్పారు. వీటిలో పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి. వివిధ రాష్ట్రాల్లోని ఓటర్ల జాబితాను నవీకరించడం, ధృవీకరించడం, అనర్హులైన ఓటర్లను తొలగించడం, నిజమైన ఓటర్లను మాత్రమే జాబితాలో ఉంచడానికి ఎన్నికల కమిషన్ ఈ ప్రక్రియ చేపడుతోంది. ఎన్నికల జాబితా క్వాలిటీపై ప్రతి ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు లేవనెత్తుతున్నందున ఎస్ఐఆర్ పక్రియ చేపట్టడం అవసరమైందని సీఈసీ చెప్పారు. 1951 నుంచి 2004 వరకూ 8 సార్లు ఎస్ఐఆర్ నిర్వహించామని, చివరిసారిగా 21 ఏళ్ల క్రితం 2002-2004 మధ్య చేపట్టామని చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల బిహార్‌లో తొలి విడత ఎస్ఐఆర్ పూర్తి చేసినట్టు చెప్పారు. ఎస్ఐఆర్ ఫేజ్-2 షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3 వరకూ ప్రింటింగ్/ ట్రైనింగ్ ఉంటుంది. నవంబర్ 4 నుంచి డిసెంబర్ 4 వరకూ హౌస్ టు హౌస్ ఎన్యూమరేషన్ ఫేజ్ ఉంటుంది. హియరింగ్/వెరిఫికేషన్ పక్రియ డిసెంబర్ 9 నుంచి 2026 జనవరి 31 వరకూ జరుగుతుంది. 2026 ఫిబ్రవరి 7న తుది ఎన్నికల జాబితా విడుదలవువుంది.రెండో విడత ఎస్ఐఆర్ జరుగనున్న రాష్టాల్లో ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ , తమిళనాడు, గోవా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కేరళ, రాజస్థాన్ ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాల్లో అండమాన్ నికోబార్ ఐలాండ్స్, లక్షద్వీప్, పుదుచ్చేరి ఉన్నాయి.

# డిజిటల్ అరెస్ట్‌లపై సుప్రీం ఆందోళన

**ప్రణాళిక రూపొందించాలని సీబీఐకి ఆదేశం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 27:** డిజిటల్ అరెస్టులపై సీబీఐ దర్యాప్తుల జరగాల్సి ఉందన్న అభిప్రాయాన్ని సుప్రీం పేర్కొంది. వరుసగా జరుగుతోన్న సైబర్ నేరాల కారణంగా పలువురు ఆర్థికంగా దోపిడీకి గురవుతున్నారు. దేశవ్యాప్తంగా ఈ కేసుల తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ఇటీవల వచ్చిన ఓ కేసును సుమోటాగా తీసుకొని విచారణ జరుపుతోంది ఈ నేరాలపై సీబీఐ దర్యాప్తును పర్యవేక్షిస్తానని పేర్కొంది. డిజిటల్ అరెస్టు కారణంగా తాను రూ.కోటి కోల్పోయానని హరియాణాకు చెందిన




ఓ వృద్ధ మహిళ వేసిన కేసు నేపథ్యంలో ఈ విచారణ జరుగుతోంది. ఈ సందర్భంగా సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వాదనలను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. మయన్మార్, థాయ్‌లాండ్ వంటి ఆఫ్‌షోర్ లొకేషన్ల నుంచి ఇలాంటి కేసులు వెలుగు చూస్తున్నాయని, ఈ కేసుల దర్యాప్తునకు ఒక ప్రణాళికను రూపొందించాలని సీబీఐను ఆదేశించింది. కేంద్ర ఏజెన్సీ దర్యాప్తులో పురోగతిని పరిశీలిస్తామని, దానిని బట్టి అవసరమైన ఆదేశాలను జారీ చేస్తామని పేర్కొంది. అలాగే డిజిటల్ అరెస్టు కేసులకు సంబంధించి వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నమోదైన ఎఫ్ఐఆర్ వివరాలను సమర్పించాలని ఆయా ప్రభుత్వాలకు నోటీసులు ఇచ్చింది.

# డిజిటల్ అరెస్ట్‌లపై అవగాహన కలిగించాలి


**అత్యంత భయంకరమైన ప్రమాదంగా గుర్తించాలి ● ఐపీఎస్ ప్రొబెషనర్లతో రాష్ట్రపతి ముర్ము**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 27:** ప్రజలను చైతన్యం చేయడంతోనే డిజిటల్ అరెస్ట్ ముప్పును ఛేదించవచ్చని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఇందుకు పోలీస్ శాఖ చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రపతి భవన్‌లో ప్రొబేషనరీ ఐపీఎస్‌లను ఉద్దేశించి ప్రసంగించిన ముర్ము ఈ వ్యాఖ్యలు చేశారు. డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను బెదిరింపులకు గురి చేస్తూ..భారీ మొత్తంలో డబ్బును కాజేస్తుండడంపై రాష్ట్రపతి ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ అరెస్టును ప్రజలకు ఉన్న అత్యంత భయంకరమైన ప్రమాదాల్లో ఒకటిగా పేర్కొన్నారు. ఇటువంటి వాటిని ఎదుర్కోవాలంటే సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు సరైన అవగాహన కల్పించాలన్నారు. పోలీసుల పట్ల ప్రజలకు భయం ఉండకూడదని, వారు తమకు రక్షణగా నిలుస్తారనే గౌరవం ఉండాలని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు వీడియో కాల్స్ చేసి..తాము పోలీసులమని బెదిరిస్తారని.. తాము చెప్పినట్లు చేయకపోతే డిజిటల్ అరెస్టు చేస్తామని భయపెడతారని ద్రౌపదీ ముర్ము అన్నారు. ఇటువంటి సమయాల్లో ప్రజలు చాకచక్యంగా వ్యవహరించి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ డిజిటల్ అరెస్టు ప్రభావం పోలీసు వ్యవస్థపైనా అధికంగా ఉంటుందన్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసుల మాదిరి ప్రజలను నమ్మించి మోసం చేయడంతో.. అసలైన పోలీసులు ఎవరనే విషయాన్ని కూడా వారు గ్రహించలేకపోతారన్నారు. దీనిని నివారించాలంటే సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, పోలీసులు నూతన సాంకేతికతపైనా పట్టు సాధించాలని సూచించారు.



# సుప్రీంకోర్టు తదుపరి సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్

**కేంద్రానికి సిఫార్సు చేసిన ప్రస్తుత సీజేఐ గవాయ్**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 27:** సుప్రీంకోర్టు కొత్త ప్రధాన నాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియామకం కానున్నారు. ఆయన పేరును సీజేఐ భూషణ్ రామకృష్ణ గవాయ్ కేంద్రానికి సిఫారసు చేశారు. జస్టిస్ సూర్యకాంత్ పేరును ఒక లేఖలో కేంద్ర న్యాయశాఖ మంత్రికి ఆయన తెలియజేశారు. గవాయ్ వారసుడి ఎన్నిక పక్రియను కేంద్ర ఇటీవల ప్రారంభించిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టు సీనియర్ జడ్జిని సీజేఐ పదవికి ఎంపిక చేస్తారు. ప్రస్తుతం అత్యున్నత న్యాయస్థానంలో జస్టిస్ కాంత్ సీనియర్ మోస్ట్ న్యాయమూర్తిగా ఉన్నారు. గవాయ్ నవంబర్ 23న పదవీ విరమణ చేయనున్నారు. దీంతో దేశ 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు చేపడతారు. 2027 ఫిబ్రవరి 9వ తేదీ వరకూ ఆయన ఈ పదవిలో ఉంటారు. హర్యానాలోని హిస్సార్‌లో 1962 ఫిబ్రవరి 10న జస్టిస్ సూర్యకాంత్ జన్మించారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు. 370వ అధికరణ రద్దు, భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, అవినీతి, పర్యావరణం, లింగ సమానత్వం వంటి కీలక తీర్పులు ఇచ్చిన ధర్మాసనాల్లో ఆయన ఉన్నారు. ఎన్నికల జవాబుదారీతనంపై తన నిబద్ధతను చాటుకుంటూ బిహార్ ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది వివరాలను వెల్లడించాలని ఇటీవల ఎన్నికల కమిషన్‌ను ఆయన ఆదేశించారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌తో సహా బార్ అసోసియేషన్లలో మూడింట ఒక వంతు సీట్లు మహిళలకు రిజర్వ్ చేయాలని చారిత్రక ఆదేశాలు సైతం ఇచ్చారు. 2022లో ప్రధాని నరేంద్ర మోదీ పంజాబ్ పర్యటనలో భద్రతా లోపాలపై దర్యాప్తునకు ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించిన ధర్మాసనంలో ఆయన కూడా ఉన్నారు. రక్షణ బలగాలకు ఓఆర్‌ఓపీ స్కీమ్‌ను సైతం ఆయన ధ్రువీకరించారు. పెగాసస్ స్పైవేర్ కేసును విచారించిన ధర్మాసనంలోనూ జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు.

# ఢిల్లీలో క్షీణిస్తున్న గాలి నాణ్యత

**తీవ్రమైన వాయుకాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు**

**ఆస్పత్రుల్లో పెరుగుతున్న శ్వాసకోస కేసులు**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 27:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ క్షీణిస్తోంది. గాలి నాణ్యత సూచీ ప్రమాదకర స్థాయిలో నమోదవుతోంది. సోమవారం ఉదయం ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో వాయు నాణ్యత సూచిక 315గా నమోదైంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న డేటా ప్రకారం.. అశోక్ విహార్‌లో అత్యధికంగా ఏక్యూఐ 416గా నమోదైంది. ఆ తర్వాత గౌతమ్ పురి వద్ద 415, ఆనంద్ విహార్ వద్ద 366గా గాలి నాణ్యత సూచీ ఉంది. గణెళిశ్‌పూర్ వద్ద 318, జీటీబీ నగర్‌లో 302, కశ్మీర్ గేట్ ఐఎస్‌బీటీ ప్రాంతంలో 298, యమూర్ విహార్‌లో 287గా ఏక్యూఐ నమోదైంది. రాత్రికి ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి వర్షం పడే అవకాశం ఉందని ఢిల్లీ ఆర్ఎమ్‌సీ అంచనా వేసింది. తీవ్రమైన వాయుకాలుష్యంతో ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యం బారిన పడుతున్నారు. ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్, ఫరీదాబాద్, ఘజియాబాద్‌లోని ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. శ్వాసకోశ, ఛాతీలో నొప్పి, దగ్గు, గొంతు నొప్పి వంటి సమస్యలతో స్థానికులు ఆసుపత్రులకు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం.. గాలి నాణ్యత 447కు పడిపోవడం అంటే దాన్ని తీవ్ర వాయు కాలుష్యంగా పరిగణించ వచ్చు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 0-100 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉండి, కాలుష్యం లేదని, ఒఖిఎ 100-200 మధ్య ఉంటే గాలి నాణ్యత మధ్యస్తంగా ఉందని అర్థం. గాలి నాణ్యత అధ్వాన్నంగా ఉందని, ఒఖిఎ 300-400 మధ్య ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వాన్నంగా ఉందని, ఒఖిఎ 400-500 మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉందని అర్థం చేసుకోవచ్చు. ఈ నెల 29న ఢిల్లీలో మొదటిసారిగా కృత్రిమ వర్షాన్ని కురిపించేందుకు ఏర్పాట్లు చేశామని సీఎం రేఖా గుప్తా వెల్లడించారు. బురాయ్‌లో ప్రయోగాత్మక పరీక్ష విజయవంతమైందన్నారు. ఐఐటీ-కాన్పూర్ సహకారంతో ఢిల్లీ ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్ట్‌కు ఐఎండీ, ఐఐటీఎమ్-పుణె తోడ్పాటును అందిస్తున్నాయి. దీపావళి తర్వాత పొగ మంచు సీజన్‌లో కాలుష్య కణాలను తగ్గించడానికి వాయువ్య ఢిల్లీలో అయిదు చోట్ల ఈ కృత్రిమ వర్షం కురిపించనున్నారు. ఇందుకోసం డీజీసీపీ అనుమతి పొందారు. సిల్వర్ అయోడైడ్ లేదా సోడియం క్లోరైడ్ లాంటి పదార్థాలను మేఘాల్లోకి విడుదల చేయడం ద్వారా కృత్రిమ వర్షాన్ని కురిపిస్తారు. ఈ వర్షం కారణంగా రాజధాని ప్రాంతంలో గాలి నాణ్యత మెరుగుపడే అవకాశం ఉంది.




# శ్వాస సంబంధిత అలర్జీలు ఉన్నాయా..?

## అయితే ఈ చిట్కాలను పాటించండి..!



సాధారణంగా చాలా మందికి అనేక రకాల అలర్జీలు ఉంటాయి. వాటిల్లో శ్వాస సంబంధిత అలర్జీ కూడా ఒకటి. వాతావరణం మారినప్పుడు లేదా సీజన్ మారినప్పుడు, చలికాలంలో శ్వాస సంబంధిత అలర్జీలు ఉన్నవారికి తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. గాలిలో ఉండే కాలుష్య కారకాలు, దుమ్ము, ధూళి కణాలు, పుప్పొడి రేణువులను పీల్చడం వల్ల శ్వాస సంబంధిత అలర్జీలు వస్తుంటాయి. దీంతో చర్మంపై దద్దుర్లు వచ్చి దురదగా ఉంటుంది. అలాగే కొందరికి దగ్గు, జ్వరం, ఆస్తమా, ముక్కు దిబ్బడ వంటి అనారోగ్య సమస్యలు సైతం వస్తాయి. అయితే శ్వాస సంబంధిత అలర్జీలు ఉన్నవారు డాక్టర్ సూచన మేరకు మందులను వాడాల్సి ఉంటుంది. అలాగే పలు ఇంటి చిట్కాలను పాటించడం వల్ల కూడా ఈ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. కొన్ని చిట్కాలను పాటిస్తే శ్వాస సంబంధిత అలర్జీలు తగ్గుతాయి.



**హెర్బల్ టీ..**

శ్వాస సంబంధిత అలర్జీలు తగ్గాలంటే అందుకు హెర్బల్ టీలు అద్భుతంగా పనిచేస్తాయి. మీకు నచ్చిన ఏదైనా హెర్బల్ టీని సేవించవచ్చు. లేదా అశ్వగంధతోనూ హెర్బల్ టీ తయారు చేసి తాగవచ్చు. అశ్వగంధ, బల, విదరి అనే మూలికలను సమాన భాగాలుగా తీసుకుని పొడి చేయాలి. ఒక కప్పు నీటిలో ఆ పొడిని 1 టీస్పూన్ మోతాదులో వేసి 3 నిమిషాల పాటు మరిగించాలి. తరువాత అందులో 5 నుంచి 10 చుక్కల మహా నారాయణ తైలం వేసి బాగా కలపాలి. ఈ హెర్బల్ టీని 15 నిమిషాలకు ఒకసారి ఒక సిప్‌లా వేసి తాగాల్సి ఉంటుంది. అలా అయిపోయే వరకు దీన్ని తాగాలి. ఇలా చేస్తుంటే అలర్జీలు తగ్గుతాయి. అయితే మహా నారాయణ తైలం లేకపోతే దానికి బదులుగా నెయ్యిని సైతం వాడుకోవచ్చు. అలాగే శ్వాస సంబంధిత అలర్జీలు తగ్గేందుకు త్రిఫల చూర్ణం కూడా బాగానే పనిచేస్తుంది. రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో అర టీస్పూన్ త్రిఫల చూర్ణం కలిపి తాగాలి. దీని వల్ల అలర్జీలు తగ్గుతాయి. అలాగే జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ముఖ్యంగా మలబద్దకం తగ్గుతుంది.

**నెయ్యి..**

శ్వాస సంబంధిత సమస్యలు ఉన్నవారు లేదా అలర్జీలు ఉన్నవారు చల్లని వాతావరణంలో ఉండకూడదు. బయట తిరగాల్సి వస్తే మాస్క్ ధరించడం మేలు చేస్తుంది. దీని వల్ల కాలుష్య కారకాలు, దుమ్ము, ధూళి కణాలు, పుప్పొడి రేణువులు ముక్కులో చేరి అలర్జీలను కలిగించకుండా అడ్డుకోవచ్చు. శ్వాస సంబంధిత అలర్జీలు ఉన్నవారికి నెయ్యి కూడా బాగానే పనిచేస్తుంది. రాత్రి పూట నిద్రించడానికి ముందు కొద్దిగా నెయ్యిని తీసుకుని కరిగించి ఒక్కో ముక్కు రంధ్రంలో ఒకటి లేదా రెండు చుక్కల చొప్పున నెయ్యి వేయాలి. ఇలా చేస్తున్నా కూడా సమస్య తగ్గుతుంది. అలాగే శ్వాస అలర్జీలు ఉన్నవారు ఆహారం విషయంలోనూ మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కూడా అలర్జీలు వస్తాయి. కనుక ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది.

**ఆహారాలు..**

శ్వాస అలర్జీలు ఉంటే తేలిగ్గా జీర్ణం అయ్యే ఆహారాలను తీసుకోవాలి. పాలు, పాల ఉత్పత్తులను చలికాలంలో లేదా సీజన్ మారినప్పుడు తీసుకోవడం తగ్గించాలి. లేదా పూర్తిగా మానేస్తే మంచిది. కొవ్వు తీసిన ఉత్పత్తులను అయినా సరే తీసుకోవచ్చు. అలర్జీలు ఉన్నవారు పాలు, పాల ఉత్పత్తులకు వీలైనంత వరకు దూరంగా ఉండడం మేలు. కొందరికి డ్రై ఫ్రూట్స్, ఊరగాయలు, వెనిగర్, బ్రెడ్ వంటి ఆహారాలు పడవు. కొందరికి పల్లీలు తింటే అలర్జీలు వస్తాయి. ఫుడ్ అలర్జీలు ఉన్నవారు కూడా శ్వాస అలర్జీ పట్ల జాగ్రత్తగా ఉండాలి. విటమిన్ సి ఉండే ఆహారాలను తింటుంటే ఈ సమస్య కొంత వరకు తగ్గుతుంది. అలాగే యాంటీ ఆక్సిడెంట్లు ఉన్న ఆహారాలను తీసుకుంటున్నా మేలు జరుగుతుంది. ఈ విధంగా ఆయా చిట్కాలను పాటిస్తూ ఆహారాలను తీసుకుంటుంటే అలర్జీ సమస్య నుంచి దూరంగా ఉండవచ్చు.



# ఉదయం పూట చాలా మంది చేసే తప్పులు ఇవే..

## వీటి వల్ల బరువు తగ్గాలనుకునే లక్ష్యం నెరవేరదు..!

అధిక బరువు తగ్గడం అన్నది ప్రస్తుతం ఎంత కష్టంగా మారిందో అందరికీ తెలిసిందే. ఒకప్పుడు ప్రజలు రోజూ శారీరక శ్రమ చేసేవారు. కనుక వారు చాలా దృఢంగా ఉండేవారు. అధిక బరువు పెరిగేవారు కాదు. వయస్సు మీద పడినప్పటికీ ఎలాంటి వ్యాధులు రాకుండా ఉండేవారు. కానీ ప్రస్తుతం అలా కాదు. చిన్నారులు సైతం ఊబకాయంతో బాధపడుతున్నారు. ఇందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. అయితే అధికంగా బరువు ఉన్నవారు దాన్ని తగ్గించుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. డైట్‌ను పాటించడం, వ్యాయామం చేయడం వంటివి అనుసరిస్తారు. కానీ అనుకున్న రీతిలో బరువు తగ్గడం లేదని వాపోతుంటారు. అయితే చాలా మంది ఉదయం పలు రకాల తప్పులు చేస్తుంటారు. దీని వల్ల కూడా బరువు పెరుగుతారు. ఆయా తప్పులు ఏమిటో తెలుసుకుని జాగ్రత్త పడితే అధిక బరువును సులభంగా తగ్గించుకునేందుకు అవకాశాలు ఉంటాయి.

**టీ, కాఫీ..**

చాలా మంది ఉదయం నిద్ర లేచిన వెంటనే పరగడుపునే టీ, కాఫీలను సేవిస్తారు. అలా తాగనిదే వారికి రోజు ప్రారంభం కాదు. అయితే వాస్తవానికి బరువు పెరిగేందుకు ఇది ప్రధాన కారణంగా చెప్పవచ్చు. బరువు తగ్గాలనే ప్రణాళికలో ఉన్నవారు అయినా సరే ఉదయం పరగడుపునే టీ, కాఫీలను తాగడం వల్ల బరువు తగ్గలేకపోతుంటారు. టీ, కాఫీలలో ఉండే చక్కెర కారణంగా బరువు పెరుగుతారు. కనుక బరువు తగ్గాలనుకునే లక్ష్యాన్ని చేరుకోలేకపోతారు. కనుక ఉదయం పరగడుపున ఆ పానీయాలను తాగకూడదు. వాటికి బదులుగా గోరు వెచ్చని నీళ్లను తాగితే ఫలితం ఉంటుంది. ఉదయం పరగడుపునే గోరు వెచ్చని నీళ్లను తాగితే శరీర మెటబాలిజం పెరుగుతుంది. క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. అలాగే శరీరంలోని వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. గోరు వెచ్చని నీటిలో కొద్దిగా నిమ్మరసం కలిపి తాగితే ఇంకా మేలు చేస్తాయి. దీని వల్ల బరువు త్వరగా తగ్గేందుకు అవకాశాలు ఉంటాయి.

**పండ్ల రసాలు..**


చాలా మంది ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేసిన తరువాత చక్కెర అధికంగా ఉండే పండ్ల రసాలను తాగుతారు. లేదా టీ, కాఫీలలోనూ చక్కెర అధికంగా కలిపి తాగుతారు. ఇలా చేయడం వల్ల కూడా బరువు తగ్గాలనుకునే లక్ష్యం నెరవేరదు. పైగా బరువు పెరుగుతారు. టీ, కాఫీలను చక్కెర కలపకుండా తాగాలి. బ్లాక్ టీ లేదా బ్లాక్ కాఫీ అయితే ఇంకా మేలు జరుగుతుంది. అలాగే పండ్ల రసాలు కూడా ఇంట్లో తయారు చేసుకున్నవి తాగాలి. బయట చక్కెర వేసి తయారు చేసినవి తాగకూడదు. వీటి వల్ల బరువు పెరుగుతారు. అలాగే ప్యాక్ చేయబడిన పండ్ల రసాలను సైతం ఉదయం తాగకూడదు. వీటిల్లోనూ చక్కెర అధికంగా ఉంటుంది. ఇది మన శరీరానికి హాని చేస్తుంది. బరువు పెరిగేలా చేస్తుంది. అలాగే అధిక బరువు వేగంగా తగ్గాలని చెప్పి కొందరు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మానేస్తారు. నేరుగా మధ్యాహ్నం లంచ్ తింటారు. కానీ ఇది ఆరోగ్యానికి అసలు మంచిది కాదు. అలా చేయడం వల్ల రోజులో ఇతర సమయాల్లో జంక్ ఫుడ్‌ను అధికంగా తింటారని, దీంతో అధికంగా బరువు పెరుగుతారని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. కనుక ఉదయం తప్పనిసరిగా బ్రేక్‌ఫాస్ట్ చేయాల్సి ఉంటుంది. మానేయకూడదు.

**జంక్ ఫుడ్..**

చాలా మంది బరువు తగ్గాలనుకునే ప్రణాళికలో ఉన్నప్పటికీ ఉదయం జంక్ ఫుడ్‌ను తింటారు. నూనె పదార్థాలను తరచూ తింటుంటారు. వీటి వల్ల శరీరంలో కొవ్వు అధికంగా చేరుతుంది. దీంతో బరువు పెరుగుతారు తప్ప తగ్గరు. దీని వల్ల బరువు తగ్గాలనుకునే లక్ష్యం నెరవేరదు. కనుక ఉదయం తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారాలు, శక్తినిచ్చే ఆహారాలను తినాల్సి ఉంటుంది. ఉదయం కోడిగుడ్లు, ఓట్స్, తృణ ధాన్యాలను తింటుంటే మేలు జరుగుతుంది. ఇవి శక్తిని, పోషకాలను అందిస్తాయి. రోజంతా ఉత్సాహంగా ఉండేలా చేస్తాయి. దీంతో చురుగ్గా ఉంటారు. యాక్టివ్‌గా పనిచేస్తారు. బద్దకం పోతుంది. అలాగే ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. ఆహారం తక్కువగా తింటారు. దీని వల్ల బరువు తగ్గడం తేలికవుతుంది. ఇక కొందరు ఉదయం నిద్ర లేచిన తరువాత కూడా చాలా సేపు బెడ్ మీద అలాగే పడుకుని ఉంటారు. ఫోన్ ఆపరేట్ చేస్తుంటారు. ఇది చాలా అనారోగ్యకరమైన చర్య. బరువు తగ్గాలనుకునే వారు ఉదయం చేసే పొరపాట్లలో ఇది కూడా ఒకటి. ఉదయం నిద్ర లేచిన వెంటనే బెడ్ మీద నుంచి దిగి కాలకృత్యాలను మొదలు పెట్టాలి. యాక్టివ్‌గా ఉండేందుకు ప్రయత్నం చేయాలి. ఇలా చేస్తే బరువు త్వరగా తగ్గడమే కాదు, ఆరోగ్యంగా కూడా ఉంటారు. ఇలా ఉదయం ఆయా తప్పులను చేయకుండా ఉంటే బరువు తగ్గాలనుకునే లక్ష్యం చాలా త్వరగా నెరవేరుతుంది.

# గర్భిణీల్లో విటమిన్ డి లోపం ఉంటే..

గర్భం ధరించిన మహిళలు తినే ఆహారం విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండాలన్న విషయం అందరికీ తెలిసిందే. అన్ని పోషకాలు ఉండే ఆహారాలను వారు రోజూ తీసుకుంటేనే గర్భస్థ శిశువు ఆరోగ్యంగా ఉంటుంది. పుట్టుకతో ఎలాంటి లోపాలు, వ్యాధులు రాకుండా ఉంటాయి. అయితే ప్రస్తుతం చాలా మంది గర్భిణీలు తమకు తెలియకుండానే పోషకాహార లోపంతో బాధపడుతున్నారని సర్వేలు చెబుతున్నాయి. స్త్రీలు సాధారణ సమయంలో కన్నా గర్భం దాల్చినప్పుడు రోజూ కాస్త ఎక్కువ ఆహారాన్ని తినాల్సి ఉంటుంది. అలాగే నీళ్లను కూడా కాస్త ఎక్కువగానే తాగాలి. దీని వల్ల శిశువుకు అన్ని పోషకాలు అంది ఆరోగ్యంగా జన్మించేందుకు అవకాశాలు ఉంటాయి. ఇక గర్భిణీలు అన్ని పోషకాలు ఉండే ఆహారాలను రోజూ తీసుకున్నట్లే విటమిన్ డి ఉండే ఆహారాలను కూడా రోజూ తీసుకోవాల్సి ఉంటుంది. చాలా మంది గర్భిణీలు విటమిన్ డి ఆహారాన్ని సరిగ్గా తినడం లేదు. దీని కారణంగా శిశువులకు అనేక వ్యాధులు, అనారోగ్య సమస్యలు వస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.




**అధిక బరువు సమస్య..**

గర్భిణీలు సరైన పౌష్టికాహారం తినకపోతే దాని ప్రభావం పుట్టబోయే బిడ్డపై పడుతుంది. గర్భిణీలు చాలా మందిలో విటమిన్ డి లోపం సమస్య ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. దీని వల్ల పిల్లలు పుట్టిన తరువాత అనేక సమస్యలు వస్తున్నాయని అంటున్నారు. గర్భిణీల్లో విటమిన్ డి లోపం ఉండడం వల్ల శిశువులు మరీ అధిక బరువుతో జన్మిస్తున్నారని, వారు స్థూలకాయం బారిన పడుతున్నారని నిపుణులు చెబుతున్నారు. అలాగే అలాంటి చిన్నారులకు 6 ఏళ్ల వయస్సు వచ్చిన తరువాత నడుం చుట్టు కొలత విపరీతంగా పెరిగి ఊబకాయులుగా మారుతున్నారని హెచ్చరిస్తున్నారు. గర్భిణీల్లో విటమిన్ డి లోపం ఉంటే దాని ప్రభావం పుట్టబోయే శిశువుపై తీవ్రంగా పడుతుందని అంటున్నారు. అలాంటి చిన్నారుల్లో అనేక సమస్యలు వస్తున్నాయని చెబుతున్నారు.

## పుట్టబోయే పిల్లల్లో ఎలాంటి వ్యాధులు వస్తాయంటే..?

**గుండె జబ్బులు, క్యాన్సర్ వచ్చే అవకాశం..**

విటమిన్ డి లోపం గర్భిణీల్లో ఉంటే పుట్టబోయే శిశువులకు గుండె జబ్బులు, మల్టిపుల్ స్లెరోసిస్ వంటి సమస్యలు వస్తున్నాయని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. అలాగే అలాంటి చిన్నారుల్లో క్యాన్సర్, టైప్ 1 డయాబెటిస్ వచ్చే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయని అంటున్నారు. ప్రస్తుతం చాలా మంది మహిళల్లో విటమిన్ డి లోపం ఉంటోంది. వారు గర్భం దాల్చిన తరువాత కూడా ఆ లోపం అలాగే కొనసాగుతుందని, అది తెలియకపోవడం వల్ల చాలా మంది సమస్యలను ఎదుర్కొంటున్నారని అంటున్నారు. విటమిన్ డి లోపం మహిళల్లో ఉంటే వెంటనే డాక్టర్‌ను కలిసి చికిత్స తీసుకోవాలని అంటున్నారు. అయితే విటమిన్ డి లోపం ఉన్నవారు ఆ విటమిన్‌ను చాలా సులభంగా పొందవచ్చు. రోజూ కాసేపు సూర్య రశ్మి తగిలేలా ఉదయం పూట ఎండలో నిలుచుంటే చాలు, విటమిన్ డిని శరీరం దానంతట అదే తయారు చేసుకుంటుంది. అలాగే కోడిగుడ్లు, చేపలు, పాలు, చీజ్, పెరుగు వంటి ఆహారాలను తీసుకుంటున్నా కూడా విటమిన్ డి లభిస్తుంది.

**66 శాతం మంది మహిళలు..**

మన దేశంలో సుమారుగా 66 శాతం మంది మహిళలు విటమిన్ డి లోపంతో బాధపడుతున్నారని అధ్యయనాల్లో తేలింది. గర్భిణీలకు 3వ నెల తరువాత ఈ సమస్య ఎక్కువగా వస్తుందని గుర్తించారు. కనుక గర్భిణీలే కాదు, గర్భం దాల్చని మహిళలు కూడా విటమిన్ డి ఉన్న ఆహారాలను రోజూ తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే డాక్టర్లు సూచించిన మేర విటమిన్ డి ట్యాబ్లెట్లను కూడా వాడవచ్చు. దీని వల్ల మహిళలు విటమిన్ డి లోపం నుంచి బయట పడవచ్చు. అలాగే శిశువుల్లో పుట్టుక లోపాలు, వ్యాధులు రాకుండా కాపాడవచ్చు.

# ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌కు భారత్ సన్నద్ధం

**సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో బరిలోకి..**

**సిరీస్ కు అందుబాటులోకి జస్ప్రీత్ బుమ్రా**



భారత క్రికెట్ జట్టు ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉంది. ఇటీవల జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు విజయం సాధించింది. తొలి 2 వన్డేల్లో కంగారూలు నెగ్గగా, మూడో వన్డేలో టీమిండియా ఘన విజయం సాధించింది. భారత్, ఆస్ట్రేలియా మధ్య అక్టోబర్ 29 నుంచి ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. టీ20 సిరీస్‌లోని అన్ని మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1:45 గంటలకు ప్రారంభమవుతాయి. అదే సమయంలో మధ్యాహ్నం 1:15 గంటలకు అన్ని మ్యాచ్‌ల టాస్ వేస్తారు. ఇటీవల జరిగిన వన్డే సిరీస్ మ్యాచ్‌లు ఉదయం 9:00 గంటలకు మొదలయ్యేవి. టీ20 సిరీస్‌లో ఇండియా జట్టుకు సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. జట్టులో కీలకమైన ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా సిరీస్ కు అందుబాటులోకి వచ్చాడు. విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, శివమ్ దూబే, సంజు శాంసన్, వరుణ్ చక్రవర్తి వంటి స్టార్ ఆటగాళ్లు టీ20 జట్టులో భాగం కానున్నారు. అయితే, స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా గాయం నుంచి కోలుకోని కారణంగా టీ20 సిరీస్‌కు అందుబాటులో లేదు. వన్డే సిరీస్‌లాగే టీ20 సిరీస్‌లోనూ ఆస్ట్రేలియా జట్టుకు కెప్టెన్‌గా మిచెల్ మార్ష్ వ్యవహరించనున్నాడు. అయితే తొలి రెండు టీ20 మ్యాచ్‌లకు ఆసీస్ జట్టును ప్రత్యేకంగా ప్రకటించారు. ఆ తర్వాత మూడో టీ20కి వేరే జట్టును, నాల్గవ, ఐదవ టీ20లకు వేరే జట్టును ప్రకటించారు. ఇందులో జోష్ ఇంగ్లిష్, మార్కస్ స్టోయినిస్, టిమ్ డేవిడ్ అందుబాటులోకి వచ్చారు. అలాగే ట్రావిస్ హెడ్, మాథ్యూ షార్ట్ కూడా టీ20 జట్టులో ఆడనున్నారు. అక్టోబర్ 29న కాన్‌బెర్రాలో జరగనున్న మ్యాచ్‌తో టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. మెొత్తం 5 టీ20 మ్యాచ్‌లు ఆడనుండగా.. గబ్బా వేదికగా చివరి టీ20 షెడ్యూల్ చేశారు. వన్డే సిరీస్ కోల్పోయిన భారత్, టీ20 సిరీస్ లో ఎలాగైనా నెగ్గాలని భావిస్తోంది.

తొలి టీ20 - అక్టోబర్ 29 - కాన్‌బెర్రా - భారత టైం ప్రకారం మధ్యాహ్నం 1:45 గంటలకు

రెండవ టీ20 - అక్టోబర్ 31 - మెల్‌బోర్న్ - భారత టైం ప్రకారం మధ్యాహ్నం 1:45 గంటలకు

మూడవ టీ20 - నవంబర్ 2 - హోబర్ట్ - భారత టైం ప్రకారం మధ్యాహ్నం 1:45 గంటలకు

నాల్గవ టీ20 - నవంబర్ 6 - గోల్డ్ కోస్ట్ - భారత టైం ప్రకారం మధ్యాహ్నం 1:45 గంటలకు

ఐదవ టీ20 - నవంబర్ 8 - గబ్బా - భారత టైం ప్రకారం మధ్యాహ్నం 1:45 గంటలకు



## శ్రేయస్ అయ్యర్ పక్కటెములకు గాయం

సిడ్నీ వేదికగా ఆసీస్‌తో జరిగిన మూడో వన్డేలో హర్షిత్ రాణా బౌలింగ్‌లో ఆసీస్ బ్యాటర్ అలెక్స్ కేరీ షాట్ ఆడగా అది మిస్‌టైమింగ్ కావడంతో బంతి గాల్లోకి లేచింది. బ్యాక్‌వర్డ్ పాయింట్ నుంచి బ్యాక్‌కి పరిగెత్తిన శ్రేయాస్ అయ్యర్.. డైవ్ చేస్తూ కళ్లు చెదిరే క్యాచ్ అందుకున్నాడు. అయితే ఈ క్యాచ్‌ను అందుకునే సమయంలో శ్రేయాస్ బలంగా నేలను గుద్దుకోవడంతో.. అతడి పక్కటెముకలకు గాయమైంది. ఫిజియో వచ్ చూడగా.. శ్రేయాస్ తీవ్రమైన నొప్పితో బాధపడుతుండడంతో గ్రౌండ్ నుండి వెళ్లిపోయాడు. ఇక వెంటనే బీసీసీఐ వైద్య బృందం శ్రేయాస్‌ను సిడ్నీలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నిర్వహించిన వైద్య పరీక్షల్లో.. శ్రేయాస్‌కి అంతర్గత రక్తస్రావం అవుతున్నట్లు రిపోర్టులో వచ్చింది. దీంతో అతన్ని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు పీటీఐ తెలిపింది. ఓ బీసీసీఐ అధికారి మాట్లాడుతూ.. శ్రేయాస్ అయ్యర్ పక్కటెముకల్లో గాయమైంది. రిపోర్టుల్లో అతడికి రక్తస్రావం అవుతున్నట్లు గుర్తించారు. వెంటనే అతడిని ఐసీయూలో చేర్చాం. కనీసం 2 నుంచి 7 రోజుల పాటు అతడు వైద్యుల పర్యవేక్షణలోనే ఉంటాడు. రక్తస్రావం ఆగి, ఇన్ఫెక్షన్ కాకుండా ఉంటే అప్పుడు తదుపరి చర్యలు తీసుకుంటారన్నాడు. మరో బీసీసీఐ అధికారి మాట్లాడుతూ.. శ్రేయస్ అయ్యర్ గాయపడిన వెంటనే టీమ్ డాక్టర్, ఫిజియో ఎలాంటి అవకాశాలను తీసుకోలేదు. వెంటనే అతడిని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. లేకపోతే అతడికి ప్రాణాల మీదకు వచ్చి ఉండొచ్చు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉంది. శ్రేయస్ అయ్యర్ ఎంతో ధృఢమైన వ్యక్తి.. అతడు త్వరగా కోలుకుని వస్తాడని చెప్పాడు. నిజానికి శ్రేయాస్ అయ్యర్ మూడు వారాల్లో కోలుకుంటాడని మొదట వార్తలు వచ్చాయి. ఇప్పుడు అంతర్గత రక్తస్రావం జరుగుతుండడంతో అతడు కోలుకునేందుకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో అతడు చాలా కాలం పాటు ఆటకు దూరం అయ్యే అవకాశం కనిపిస్తుంది. ఈ క్రమంలో శ్రేయాస్ అయ్యర్ దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు అందుబాటులో ఉండకపోవచ్చు.

## దక్షిణాఫ్రికా కెప్టెన్‌గా బావుమా

**భారత్‌తో టెస్ట్ సిరీస్ జట్టు ప్రకటన**



నవంబర్ నెలలో దక్షిణాఫ్రికా భారత్ పర్యటనకు వచ్చి 2 టెస్టులు, 3 వన్డేలు, 5 టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లను ఆడనుంది. టెస్ట్ సిరీస్‌తో ప్రారంభం కానుంది, దీని మొదటి మ్యాచ్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ స్టేడియంలో నవంబర్ 14 నుంచి నవంబర్ 18 వరకు జరుగుతుంది. దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు భారత్‌తో జరిగే టెస్ట్ సిరీస్ కోసం తమ జట్టును ప్రకటించింది. టెస్ట్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ రెండో హోమ్ టెస్ట్ సిరీస్ ఇది, దీనికి ముందు గిల్ అండ్ టీమ్ వెస్టిండీస్‌తో జరిగిన 2 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను 2-0తో గెలిచింది. దక్షిణాఫ్రికా తన చివరి టెస్ట్ సిరీస్‌ను పాకిస్తాన్‌తో 1-1తో ముగించింది, మొదటి మ్యాచ్ పాకిస్తాన్ గెలిస్తే, రెండో మ్యాచ్ దక్షిణాఫ్రికా గెలిచింది. టెంబావుమాతో పాటు కార్బిన్ బాష్, డెవాల్డ్ బ్రెవిస్, టోనీ, డీ జోర్జి, జుబేర్ హంజా, సైమన్ హర్మర్, మార్కో యాన్సెన్, కేశవ మహరాజ్, ఎయిడెన్ మార్క్‌రమ్, వియాన్ ముల్డర్, సెనురన్ ముత్తుసామి, కగిసో రబడా, ర్యాన్ రికెల్టన్, ట్రిస్టన్ స్టబ్స్, కైల్ వెరినెలు చోటు దక్కించుకున్నారు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 ఎడిషన్‌లో భాగంగా జరిగే ఈ సిరీస్ గెలవడం టీమిండియాకు కీలకం. సొంతగడ్డపై జరిగే సిరీస్‌లు గెలిస్తేనే టీమిండియా ఫైనల్ అవకాశాలు మెరుగుపడుతాయి. తొలి రెండు ఎడిషన్స్‌లో ఫైనల్ చేరి తుదిలో టైటిల్ చేజార్చుకున్న భారత్.. మూడో ఎడిషన్‌లో తృటిలో ఫైనల్ బెర్త్‌ను కోల్పోయింది. ఈ ఎడిషన్‌లో సౌతాఫ్రికా విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. వరల్డ్ ఛాంపియన్ అయిన సౌతాఫ్రికా.. పాకిస్థాన్‌తో రెండు టెస్టుల సిరీస్‌ను డ్రా చేసుకుంది. భారత్‌లో గెలవడమే లక్ష్యంగా బరిలోకి దిగుతుంది. నవంబర్ 14 నుంచి కోల్‌కతా, 22 నుంచి గువాహతి వేదికగా టెస్ట్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ సిరీస్ కోసం ఇంకా భారత జట్టును ప్రకటించలేదు. వెస్టిండీస్‌తో ఆడిన జట్టునే దాదాపు కొనసాగించే అవకాశం ఉంది.

**దక్షిణాఫ్రికా టెస్ట్ జట్టు**

టెంబా బావుమా (కెప్టెన్), డెవాల్డ్ బ్రెవిస్, మార్కో జాన్సెన్, ఎయిడెన్ మార్క్రమ్, జుబైర్ హంజా, కేశవ్ మహారాజ్, రయాన్ రికెల్టన్, టోనీ డి జోర్జీ, సెనరన్ ముత్తుసామి, ట్రిస్టన్ స్టబ్స్, కోర్బిన్ బోష్, కగిసో రబాడా, కైల్ వెరెన్నే, వియాన్ ముల్డర్, సైమన్ హార్మర్.

## కోహ్లీ, రోహిత్ నాశనం కోరుకున్నారు

**ఏబీ డివిలియర్స్ సంచలన వ్యాఖ్యలు**



సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. టీమిండియా స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ విఫలమవ్వాలని కొంతమంది కోరుకున్నారని, వారు రిటైర్మెంట్ ప్రకటించాలని భావించారని తెలిపాడు. ఈ ఇద్దరిపై అనవసరమైన నెగటివిటీని క్రియేట్ చేస్తూ విమర్శలు గుప్పించారని మండిపడ్డాడు. సుదీర్ఘ విరామం తర్వాత ఆస్ట్రేలియా పర్యటనతో టీమిండియాలోకి రీఎంట్రీ ఇచ్చిన కోహ్లీ, రోహిత్ తొలి మ్యాచ్‌లో దారుణంగా విఫలమయ్యారు. కోహ్లీ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో డకౌట్ కాగా.. రోహిత్ తొలి మ్యాచ్‌లో 8 పరుగులకే ఔటయ్యాడు. ఆఖరి మ్యాచ్‌లో ఇద్దరూ అద్భుతమైన బ్యాటింగ్‌తో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించారు. రోహిత్(121) సెంచరీతో చెలరేగగా.. కోహ్లీ(74) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. అయితే తొలి రెండు మ్యాచ్‌ల్లో విఫలమైన కోహ్లీపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. రిటైర్మెంట్ ప్రకటించాలనే మాటలు వినిపించాయి. ఈ విమర్శలపై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన ఏబీ డివిలియర్స్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. 'ప్రజలు ఏం అనుకుంటున్నారో అర్థం కావడం లేదు. అసలు వారిని ప్రజలు అని పిలవచ్చో లేదో కూడా తెలియదు. క్రీడాకారులు తమ కెరీర్ చివరి దశకు చేరుకోగానే.. బొద్దింకల్లా బొక్కల్లో నుంచి బయటకు వచ్చినట్లు వచ్చి విమర్శలు గుప్పిస్తారు. ఇలా ఎందుకు చేస్తారు? దేశం కోసం, క్రికెట్ కోసం తమ జీవితాన్ని ధారపోసిన ఆటగాళ్లపై ఎందుకు ఇంత నెగటివిటీని పెంచుతారు? వారిని గౌరవించుకోవడానికి ఇదే సరైన సమయం. గత కొద్ది నెలలుగా కోహ్లీ, రోహిత్ చాలా విమర్శలు ఎదుర్కొన్నారు. కారణం ఏంటో తెలియదు కానీ ప్రతీ ఒక్కరు కోహ్లీ, రోహిత్‌లను తక్కువ చేసే ప్రయత్నం చేశారు. నేను కొంతమంది గురించి ఈ వ్యాఖ్యలు చేస్తున్నాను. ఎందుకంటే మెజార్టీ ప్రజలు రోహిత్, విరాట్ కోహ్లీలను ఆరాధిస్తారు. వారి అద్భుతమైన కెరీర్‌ను కొనియాడుతారు. వారి సక్సెస్‌ను సంబరాలు చేసుకుంటారు. వారి సక్సెస్‌ను మరోసారి సెలబ్రేట్ చేసుకోవడానికి ఇదే అద్భుతమైన సమయం'అని ఏబీ డివిలియర్స్ చెప్పుకొచ్చాడు.



## చెన్నై సూపర్ కింగ్స్ నాయకుడిగా సంజూ శాంసన్!?

వచ్చే ఐపీఎల్‌లో కొన్ని జట్లకు కొత్త కెప్టెన్లు వచ్చే అవకాశం ఉంది. మినీ వేలం తరువాత టీమ్‌లో ఆటగాళ్లను బట్టి.. కొత్త కెప్టెన్ ఎంపిక చేసే ఛాన్స్ ఉంది. ముఖ్యంగా చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ వంటి జట్లు కచ్చితంగా కెప్టెన్లను మారుస్తారని ప్రచారం జరుగుతోంది. సంజూ శాంసన్ రాజస్థాన్‌ను వీడడం దాదాపు ఖాయమైంది. వచ్చే సీజన్ ఐపీఎల్‌కు అన్ని టీమ్‌లు రెడీ అవుతున్నాయి. మినీ వేలానికి ముందు ప్లేయర్లపై ఓ అంచనాకు రానున్నాయి. కొన్ని టీమ్‌లు కెప్టెన్లను మార్చే అవకాశం ఉంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్‌ను మార్చే అవకాశం లేదు. కమ్మిన్స్ నాయకత్వంలోనే సన్‌రైజర్స్ ఓసారి ఫైనల్స్‌కు చేరుకుంది. కమ్మిన్స్‌ను ఎస్ఆర్‌హెచ్ మేనేజ్‌మెంట్‌కు పూర్తి నమ్మకం ఉంది. ముంబై ఇండియన్స్‌ను హార్దిక్ పాండ్యా నడిపించనున్నాడు. ఈ సీజన్‌లో పాండ్యా నాయకత్వంలో టాప్-4లో నిలిచింది. 2024 సీజన్‌కు ముందు రోహిత్ శర్మను కాదని.. పాండ్యాకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. కోల్‌కతా నైట్ రైడర్స్ వచ్చే సీజన్‌కు కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేసే అవకాశం కనిపిస్తోంది. ఈ సీజన్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన అజింక్య రహానే స్థానంలో యువ కెప్టెన్‌ను ఎంపిక చేస్తారని అంటున్నారు. మినీ వేలం తరువాత కెప్టెన్ ఎంపికపై తుది నిర్ణయం తీసుకోనుంది. ఎలాంటి అంచనాలు లేకుండా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు కెప్టెన్‌గా ఎంపికైన రజత్ పాటిదార్.. తొలిసారి ట్రోఫీని అందించాడు. వచ్చే సీజన్‌కు కూడా రజత్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్‌గా రాకతో పంజాబ్ కింగ్స్ టీమ్ జాతకం మారిపోయింది. అద్భుతమైన బ్యాటింగ్.. స్ఫూర్తిదాయకమైన నాయకత్వంతో పంజాబ్‌ను ఫైనల్ వరకు తీసుకువచ్చాడు. వచ్చే ఏడాది కూడా అయ్యర్ కెప్టెన్‌గా ఉండనున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్ కొత్త కెప్టెన్ ఎంపిక చేయాలని ప్లాన్ చేస్తోంది. ఈ సీజన్‌లో అక్షర్ పటేల్ పెద్దగా ప్రభావం చూపించలేకపోయాడు. మినీ వేలం తరువాత ఢిల్లీ కూడా కెప్టెన్సీ విషయంలో నిర్ణయం తీసుకునే ఛాన్స్ ఉంది. రుతురాజ్ గైక్వాడ్‌ను కెప్టెన్‌గా కొనసాగించాలా.. వద్దా.. అని చెన్నై సూపర్ కింగ్స్ ఆలోచిస్తోంది. ఒకవేళ సంజూ శాంసన్‌ను టీమ్‌లోకి తీసుకుంటే అతడికే కెప్టెన్సీ కూడా అప్పగించే అవకాశం ఉంది. ఇతర స్టార్ ప్లేయర్లు ట్రేడ్ జరగకపోతే.. రుతురాజ్ కెప్టెన్‌గా ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గుజరాత్ టైటాన్స్‌ను శుభ్‌మాన్ గిల్ మరోసారి నాయకుడిగా నడిపించనున్నాడు. ఇప్పుడు టీమిండియా కెప్టెన్‌గా ప్రమోట్ అయిన గిల్‌కు గుజరాత్‌కు నాయకత్వం వహించడం కలిసి వచ్చింది. గుజరాత్ టైటాన్స్‌ను శుభ్‌మాన్ గిల్ మరోసారి నాయకుడిగా నడిపించనున్నాడు. ఇప్పుడు టీమిండియా కెప్టెన్‌గా ప్రమోట్ అయిన గిల్‌కు గుజరాత్‌కు నాయకత్వం వహించడం కలిసి వచ్చింది. రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్సీ మార్పు దాదాపు ఖాయమైంది. సంజూ శాంసన్ టీమ్‌ను వీడే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో రియాన్ పరాగ్ లేదా మరో స్టార్ ప్లేయర్‌ను మినీ వేలంలో తీసుకుని కెప్టెన్‌గా నియమించే ఛాన్స్ ఉంది. ఒకవేళ సంజూ టీమ్‌లోనే ఉంటే.. అతనే కెప్టెన్‌గా కొనసాగుతాడు.

## భారత ఓపెనర్ ప్రతికా రావల్‌కు తీవ్ర గాయం



2025 మహిళల వరల్డ్‌కప్ లీగ్ స్టేజ్‌లో భారత్-బంగ్లాదేశ్ మధ్య జరిగిన ఆఖరి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. తొలి నుంచీ వర్షం ఆటకు అంతరాయం కలిగించడంతో మ్యాచ్‌ను 27 ఓవర్లకు కుదించారు. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లా 27 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో భారత్ ఆధిపత్యం ప్రదర్శిస్తూ విజయం వైపునకు దూసుకెళ్తుండగా వర్షం మరోసారి ఆటకం కలిగించింది. 8.4 ఓవర్ల వద్ద వర్షం రావడంతో ఆట ఆగిపోయింది. అప్పటికి భారత్ స్కోర్ 57-0 గా ఉంది. ఎంతసేపటికీ వర్షం తగ్గకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. అయితే ఈ మ్యాచ్‌లో భారత్‌తు అతిపెద్ద షాక్ తగిలింది. సెమీఫైనల్‌కు ముందు స్టార్ ఓపెనర్ గాయపడడం టీమ్‌ఇండియా ఫ్యాన్స్‌ను ఆందోళనకు గురిచేస్తుంది. ఈ మ్యాచ్‌లో భారత ఓపెనర్ ప్రతికా రావల్ ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు తీవ్ర గాయానికి గురైంది. దీప్తి శర్మ బౌలింగ్‌లో బంగ్లా బ్యాటర్ ఆఫ్ సైడ్? బాదిన షాట్ బౌండరీ వైపునుకు దూసుకెళ్తుంది. అక్కడే ఫీల్డింగ్ చేస్తున్న ప్రతీక బంతిని ఆపే ప్రయత్నంలో జారి పడింది. దీంతో ఆమె కాలి చీలమండ మెలికపడి నొప్పితో విలవిల్లాడింది. వెంటనే వైద్య సిబ్బంది వచ్చి ఆమెను మైదానం నుంచి బయటకు తీసుకెళ్లారు. ఆ సమయంలో ప్రతీక కుంటుతూ కనిపించింది. 'ఫీల్డింగ్ చేస్తుండగా ప్రతీకా రావల్ గాయపడింది. ఆమె కాలి చీలమండకు గాయమైంది. ప్రస్తుతం ఆమె స్కానింగ్‌కు వెళ్లింది. రిపోర్టులు రావాల్సి ఉంది. బీసీసీఐ వైద్య సిబ్బంది మాత్రం ఆమె పురోగతిని పర్యవేక్షిస్తుంది' అని టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ పేర్కొంది. కాగా, ఈ టోర్నీలో ప్రతీకా ఓపెనర్‌గా భారత్‌కు అద్భుతమైన ఆరంభాలు ఇస్తోంది. గత మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై 122 పరుగుల భారీ ఇన్నింగ్స్‌తో సత్తా చాటింది. ప్రస్తుత టోర్నీలో ప్రతీక 6 ఇన్నింగ్స్‌ల్లో 51 యావరేజ్‌తో 308 పరుగులు చేసింది. అయితే భారత్ ఈనెల 30 (గురువారం) రెండో సెమీఫైనల్ ఆడాల్సి ఉంది. ఈ పోరులో బలమైన ఆస్ట్రేలియాను ఢీ కొట్టాల్సి ఉంది. ఈ క్రమంలో ప్రతీక తొందరగా కోలుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు. ఇక ఈ మ్యాచ్ రద్దు అవ్వడంతో ఇరుజట్లకు చెరో పాయింట్ దక్కింది. దీంతో భారత్ 7 మ్యాచ్?ల్లో 3 విజయాలతో భారత్ (7 పాయింట్లు) నాలుగో స్థానంతో లీగ్ స్టేజ్?ను ముగించింది. మరోవైపు బంగ్లాదేశ్ ఏడింటిలో ఒకే ఒక్క విజయం (3 పాయింట్లు)తో ఏడో స్థానంతో టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఇక టోర్నీలో ఒక్క ఓటమి లేని ఆస్ట్రేలియా (13 పాయింట్లు) టాప్‌లో ఉండగా, ఇంగ్లాండ్ (11 పాయింట్లు), సౌతాఫ్రికా (10 పాయింట్లు) రెండు, మూడు స్థానాల్లో వరుసగా ఉన్నాయి.

# ఆనాటి సీన్ ఇప్పటికీ గుర్తుంది

## బాహుబలి నిర్మాణంపై రాజమౌళి

బాహుబలి రెండు పార్టులను కలిపి ఒకే సినిమాగా తీసుకువస్తున్న క్రమంలో ఈ రీ రిలీజ్ సినిమాకు భారీ క్రేజ్ వస్తోంది. రెండు పార్టులను కలపడంతో పాటు కొన్ని కొత్త సీన్లను కూడా యాడ్ చేసినట్టు తెలుస్తోంది. ఇక మూవీని ప్రమోట్ చేయడానికి రాజమౌళి, ప్రభాస్, రానా రెడీ అయిపోయారు. ఈ ముగ్గురూ కలిసి తాజాగా ఓ ఇంటర్వ్యూలో సందడి చేశారు. బాహుబలి సమయంలోని చాలా విషయాలను పంచుకున్నారు. తాజాగా ఇందుకు సంబంధించిన ప్రోమోను రిలీజ్ చేశారు. ఇందులో ప్రభాస్ మాట్లాడుతూ.. పదేళ్లు అవుతోంది కదా.. మీకెలా అనిపిస్తోందని అడిగాడు. తనకు ఇప్పటికీ కొన్ని సీన్లు అలాగే మైండ్ లో ఉండిపోయాయని తెలిపాడు జక్కన్న. మరీ ముఖ్యంగా కట్టప్ప బాహుబలిని చంపడానికి కత్తి పట్టుకున్న టైమ్ లో ఇచ్చిన ఎక్స్ ప్రెషన్లు ఇప్పటికీ తన మైండ్ లో ఉండిపోయాయన్నాడు. అలాగే భళ్లాల దేవుడి విగ్రహాన్ని పైకి లేపే సమయంలో చేతులు వణికాయంటూ ప్రభాస్ గుర్తు చేసుకున్నాడు. ఇక ప్రభాస్ సభలో తల నరికే సీన్ గురించి కూడా మాట్లాడుకున్నారు. ఆ సీన్ మూడో రోజు ప్రభాస్ తల నరుకుతాడని రానా గుర్తు చేశాడు. అవును అది ఆ సీన్ లో చాలా బాగుంటుంది అన్నాడు రాజమౌళి. అవును అది మాట్లాడుకోవడానికి బాగుంది కానీ అంటూ ప్రభాస్ అన్నాడు. అంతకు మించి ప్రోమోలో చూపించలేదు. ముగ్గురూ ఇందులో సరదాగా మాట్లాడుకున్నారు. ఈ ఇంటర్వ్యూ బ్లాస్ట్ కావడం ఖాయం అంటున్నారు ఫ్యాన్స్. 'బాహుబలి: ది ఎపిక్' టైటిల్‌తో ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రభాస్, రానా స్పెషల్ ఇంటర్వ్యూలో సందడి చేశారు. షూటింగ్ జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఓ కీలక సన్నివేశం గురించి రాజమౌళి ప్రస్తావించగా.. 'ఇప్పుడు బాగానే ఉంది. కానీ, అప్పుడు..' అంటూ ప్రభాస్ నవ్వులు పూయించారు. తాజాగా ప్రోమో విడుదలైంది. పూర్తి వీడియో త్వరలోనే రిలీజ్ కానుంది.






# బాలీవుడ్ క్రమశిక్షణా రాహిత్యంపై పంచ్

ఒకరిని పొగడటం అంటే ఇంకొకరిని తిట్టడం కాదు! కానీ ఇక్కడ శ్రుతిహాసన్ దక్షిణాది చిత్రసీమ గురించి ప్రశంసలు కురిపించిన తీరు కచ్చితంగా హిందీ చిత్రసీమతో పోలికలు, లోపాలను బహిర్గతం చేసింది. దక్షిణాది పరిశ్రమలో ప్రతిదీ క్రమశిక్షణతో నడిపిస్తారు. ఇక్కడ సంస్కృతి సాంప్రదాయం గొప్పవి. కొబ్బరి కాయ కొట్టి, పూజలు పునస్కారాలతో సినిమాల ప్రారంభోత్సవాలు ఘనంగా చేస్తారు. సాంప్రదాయాలు ఆచారాలను నమ్ముతారు. ఇక్కడ వినయం గౌరవంలో తగ్గరు. సెట్లో నియమాలను అందరూ పాటిస్తారని హిందీ పరిశ్రమలో ఇలాంటివి చూడలేదు అని తెలిపారు. నిజానికి కొంత కాలంగా హిందీ చిత్రసీమలో క్రమశిక్షణా రాహిత్యం గురించి చాలా చర్చ సాగుతోంది. స్టార్లకు ఇష్టానుసారం ఆలస్యంగా సెట్స్ కి వచ్చే అలవాటు ఉంది. అభినవ్ కశ్యప్ లాంటి దర్శకుడు పదే పదే ఖాన్ ల త్రయం క్రమశిక్షణా రాహిత్యం గురించి విమర్శిస్తున్నారు. క్వీన్ కంగన రనౌత్ చాలా సందర్భాల్లో ఉత్తరాది అగ్ర హీరోల ఆధిపత్య ధోరణి, మనస్తత్వంపై చాలా చెణుకులే వేసారు. దక్షిణాది పరిశ్రమలో గౌరవం ఇచ్చి పుచ్చుకునే విధానం గురించి, వర్క్ కల్చర్ గురించి ప్రశంసలు కురిపించిన కంగన, ఉత్తరాది స్టార్ల క్రమశిక్షణా రాహిత్యాన్ని దెప్పి పొడిచింది. ఇటీవల అనురాగ్ కశ్యప్ సైతం ఉత్తరాది పరిశ్రమలో క్రమశిక్షణ- సరైన నడవడిక లేకపోవడం వల్ల సౌత్ కి వచ్చేశానని తెలిపారు. ప్రస్తుతం ఆయన ఇక్కడే నటిస్తూ, దర్శకుడిగాను కొనసాగుతున్నారు. ఇటీవల ఓ సినిమా మేకింగ్ విషయంలో తలమునకలుగా ఉన్నారు కశ్యప్. ప్రేమ.. పని... ఉద్యోగం గురించి నిజాయితీగా మాట్లాడితే సమాజం హర్షించదని కూడా శ్రుతి వ్యాఖ్యానించింది. నిజం మాట్లాడితే ఎదుటివారిని జనం వేలెత్తి చూపిస్తారని పేర్కొంది. తన కాస్మోటిక్ సర్జరీల గురించి నిజాయితీగా బహిరంగంగా మాట్లాడినందుకు జనం ఇలానే ప్రవర్తిస్తారని అంది. బయట ఎవరో ఏదో అనుకుంటారని నన్ను నేను మార్చుకోలేను.. నాలాగే నేను ఉంటాను! అని తెలిపింది.



# గర్ల్‌ఫ్రెండ్‌లో గెస్ట్ రోల్‌ను తిరస్కరించిన వంగా

నేషనల్ క్రష్ రశ్మికా మందణ్ణ నటించిన హిందీ మూవీ 'థామా'వంద కోట్ల క్లబ్ లో చేరింది. మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ బ్యానర్ నుండి ఇటీవల కాలంలో వచ్చిన సూపర్ హిట్ చిత్రాల సరసన ఇది చేరకపోయినా... రశ్మిక అభిమానులు మాత్రం ఆమె పోషించిన బేతాళురాలి పాత్ర కొత్తగా ఉందని ఆనందిస్తున్నారు. ఇదిలా ఉంటే... రశ్మిక నటించిన మరో చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్' నవంబర్ 7న పాన్ ఇండియా స్థాయిలో జనం ముందుకు రాబోతోంది. దీన్ని అల్లు అరవింద్ సమర్పణలో నిర్మించారు. నటుడు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఓ కీలక పాత్రను చేయమని ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగను అడిగారట. ఈ విషయం గురించి దర్శకుడు రాహుల్ ఇటీవల మాట్లాడుతూ, 'ఈ సినిమాలో అతిథి పాత్రను మించిన ఓ కీలకమైన పాత్ర ఒకటి ఉంది. అది సందీప్ రెడ్డి వంగ చేస్తే కొత్తగా ఉంటుందనిపించింది. ఆయనలో మంచి నటుడు కూడా ఉన్నాడని నా నమ్మకం. అదే ధైర్యంతో ఆయన్ని అప్రోచ్ అయ్యాను. అయితే సందీప్ ఈ ఆఫర్ ను సున్నితంగా తిరస్కరించాడట. అతిథి పాత్రలో సరదాగా ఒకటి రెండు సీన్స్ అంటే ఓకే కానీ... నాలుగైదు సీన్స్ చేయడం కష్టమే' అని చెప్పేశాడట. దాంతో రాహుల్ రవీంద్రన్ ఆ పాత్ర చేయమని ప్రముఖ నటుడు 'వెన్నెల' కిశోర్ ను కోరాడట. ఎందుకంటే... 'వెన్నెల' కిశోర్, రాహుల్ రవీంద్రన్ మధ్య మంచి స్నేహం ఉంది. మాములూ గా అయితే రాహుల్ రవీంద్రన్ మాటను 'వెన్నెల' కిశోర్ ఎప్పుడూ కాదని చెప్పడు. కానీ ఆ పాత్రకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని, కమెడియన్ ఇమేజ్ ఉన్న తాను అలాంటి సీరియస్ పాత్ర చేస్తే జనం యాక్సెప్ట్ చేయరని కిశోర్ స్పష్టం చేశాడట. దాంతో ఇక గత్యంతరం లేక తానే ఆ పాత్రను చేశానని రాహుల్ తెలిపాడు. ఇటీవల వచ్చిన 'ది గర్ల్ ఫ్రెండ్' ట్రైలర్ లో రాహుల్ రవీంద్రన్ కనిపించాడు. నిజానికి తాను మల్టిపుల్ టాస్క్స్ చేయలేనని, అందుకే దర్శకత్వం, నటన ఒకేసారి చేయడం ఇష్టముండేది కాదని రాహుల్ రవీంద్రన్ తెలిపాడు. తాను గతంలో దర్శకత్వం వహించిన 'చి.లా.సౌ.', 'మన్మధుడు -2' చిత్రాలలో అందుకే నటించలేదని తెలిపాడు. కానీ ఈ సినిమాలో మాత్రం ఆ పాత్ర చేయకతప్పలేదని అన్నాడు. నిజానికి రాహుల్ ఫస్ట్ ఛాయిస్ అయిన సందీప్ రెడ్డి వంగా ఈ పాత్రను చేసి ఉంటే... సినిమాకు ఖచ్చితంగా ప్లస్ అయ్యి ఉండేది. ఎందుకంటే... 'పుష్ప' సినిమా తర్వాత హిందీలో రష్మికా మందణ్ణకు మళ్ళీ ఆ రేంజ్ హిట్ ఇచ్చిన సినిమా 'యానిమల్'. దాని దర్శకుడు సందీప్ రెడ్డి వంగ, రశ్మిక స్క్రీన్ షేర్ చేసుకుని ఉంటే... ఖచ్చితంగా అది ఉత్తరాది ఆడియెన్స్ లోనూ క్యూరియాసిటీ క్రియేట్ చేసి ఉండేది.





# మన శంకర్ వరప్రసాద్ గారు

## హాట్ కేకులా బిజినెస్ పార్ట్ పూర్తి

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం 'మన శంకర్ వరప్రసాద్ గారు' అనే సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాని అత్యంత ప్రతిష్టాత్మకంగా మెగాస్టార్ చిరంజీవి కుమార్తె సుష్మితతో పాటు సాహు గారపాటి కూడా నిర్మిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా రిలీజ్ ప్లాన్ చేయబడిన ఈ సినిమా అనౌన్స్ చేసిన నాటి నుంచి భారీ అంచనాలు ఉన్నాయి. దానికి కారణం అనిల్ రావిపూడి కామెడీ టైమింగ్ అనే చెప్పాలి. ఎందుకంటే, గతంలో ఆయన చేసిన అన్ని సినిమాలు కామెడీ టైమింగ్‌తోనే వర్కౌట్ అయ్యాయి. దానికి తోడు, చివరిగా ఆయన చేసిన విక్టరీ వెంకటేష్ సినిమా, సంక్రాంతికి వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఏకంగా 300 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టింది. ఈ నేపథ్యంలో, మెగాస్టార్ టైమింగ్‌తో పాటు అనిల్ రావిపూడి కామెడీ టైమింగ్ కూడా సింక్ అయితే, ఈ సినిమాని ఆపేవారే లేరని ప్రచారం. ఈ నేపథ్యంలో సినిమా బిజినెస్ కూడా హాట్ కేకులా పూర్తయినట్లుగా సమాచారం. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ సినిమా నాన్ థియేట్రికల్ రైట్స్ తోనే సినిమా బడ్జెట్ అంతా కవర్ అయిపోయినట్లుగా తెలుస్తోంది. ఈ మధ్యకాలంలో సినిమాల నాన్ థియేటర్ బిజినెస్ గాలిలో దీపంలా మారిపోతున్న తరుణంలో, ఏకంగా షూటింగ్ దశలో ఉండగానే నాన్ థియేట్రికల్ పూర్తి చేసుకోవడం అనేది ఒక ఆసక్తికరమైన పరిణామం అనే చెప్పాలి. ఈ సినిమా డిజిటల్ రైట్స్ జీ సంస్థ దక్కించుకున్నట్లుగా సమాచారం. నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రంగం సిద్ధమవుతోంది.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463